



నామినేషన్ల సందర్భంగా కలెక్టరేట్‌లో ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేస్తున్న జేసీ మయూర్ అశోక్

నామినేషన్ల సందడి

తొలిరోజు పది మంది దాఖలు

- లోక్‌సభ స్థానానికి ముగ్గురు
- నాలుగు అసెంబ్లీ స్థానాలకు ఏడుగురు

భీమిలిలో గంటా నామినేషన్

- ఆయనతో పాటు డమ్మీగా ఆయన కుమారుడు
- రెండేసి సెట్లు రిటర్నింగ్ అధికారికి అందజేత
- భారీగా తరలివచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు
- విశాఖ ఎంపీ స్థానానికి ప్రజా శాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ నామినేషన్
- భారీ పోలీస్ బందోబస్తు

విశాఖపట్నం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి):

సార్వత్రిక ఎన్నికలకు గురువారం నోటిఫికేషన్ విడుదలైంది. దీంతో నామినేషన్ల ఘట్టం ప్రారంభమైంది. తొలిరోజు విశాఖ లోక్‌సభ స్థానానికి ముగ్గురు, మూడు అసెంబ్లీ స్థానాలకు ఏడుగురు నామినేషన్లు దాఖలు చేశారు. ప్రధాన రాజకీయ పార్టీ నుంచి గంటా శ్రీనివాసరావు భీమిలి అసెంబ్లీ స్థానానికి రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు.

జిల్లాలో ఉన్న ఒక లోక్‌సభ స్థానానికి ఇండిపెండెంట్‌గా వడ్డి హరిగణేష్, ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కిలారి ఆనందపాల్ (కేఏ పాల్), పిరమిడ్ పార్టీ నుంచి పి.సత్యవతి ఒక్కొక్క సెట్ నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ వేసేందుకు ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ కొద్దిమంది మద్దతుదారులతో కలెక్టరేట్‌కు వచ్చారు. అయితే ఆయనతోపాటు మరో నలుగురిని మాత్రమే కలెక్టరేట్ లోనికి అనుమతించారు. తొలిరోజు నామినేషన్ దాఖలు చేసిన ముగ్గురు కూడా లోక్‌సభ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి డాక్టర్ ఎ.మల్లికార్జునకు నామినేషన్లు అందజేసి ప్రమాణం చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్ నామి నేషన్లను పరిశీలించారు. నామినేషన్ల ప్రక్రియ మొదలు కావడంతో కలెక్టరేట్ ఆవరణలో భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు.

గురువారం ఉదయం పది గంటల తరువాత జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్వో మోహన్‌కుమార్ కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాట్లు పరిశీలించి పోలీసులకు పలు సూచనలు చేశారు. పోలీసులు ప్రధానగేటు వద్ద బందోబస్తు ఏర్పాటుచేసి వాహనాల రాకపోకలను నియంత్రించారు. కార్యాలయ ఆవరణ లోకి మూడు వాహనాలను, మధ్య ఉన్న గేటు నుంచి అభ్యర్థితోపాటు ఐదుగురిని మాత్రమే అనుమతించారు. నామినేషన్ల ఘట్టం ముగిసేంత వరకు అంటే ఈనెల 25వ తేదీ ... మిగతా 6వ పేజీలో



నామినేషన్ సందర్భంగా గురువారం భీమిలిలో గంటా శ్రీనివాసరావు భారీ ర్యాలీ

నేడు అనకాపల్లి జిల్లాలోకి జగన్ బస్సు యాత్ర

- నక్కపల్లి మండలం చినదొడ్డిగల్లు వద్ద రాత్రి బస



పాయకరావుపేట, ఏప్రిల్ 18: ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర శుక్రవారం రాత్రి పాయకరావు పేట వద్ద అనకాపల్లి జిల్లాలోకి ప్రవేశించనుంది. కాకినాడ జిల్లా తునిలో పర్యటన ముగించుకుని రాత్రి తొమ్మిది గంటలకు జాతీయ రహదారి మీదుగా జిల్లాలోకి ప్రవేశిస్తారు. ఆయన జాతీయ రహదారి మీదుగా నక్కపల్లి మండలం చినదొడ్డిగల్లు చేరుకుని అక్కడ రాత్రి బసచేస్తారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

మే 1 నుంచి పవన్‌కల్యాణ్ పర్యటన



విశాఖపట్నం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ఉత్తరాంధ్రలో పర్యటించనున్నారు. ఒకటో తేదీన ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని ఎలమంచిలి, పెందుర్తి, రెండో తేదీన విశాఖ దక్షిణ నియోజకవర్గాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. మూడో తేదీన పాలకొండ, నెల్లిమర్ల నియోజకవర్గాల్లో పర్యటిస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి.

'ఉక్కు'రిబిక్కిరి



- విశాఖ స్టీల్‌ప్లాంటుకు విషమ పరీక్ష
- గంగవరం పోర్టు నుంచి ఇంకా అందని కోకింగ్ కోల్
- ప్రత్యామ్నాయ ప్రయత్నాలన్నీ విఫలం
- బొగ్గు సరఫరా లేకపోవడంతో థర్మల్ పవర్ ప్లాంటు, రెండు కోక్ ఓవెన్ బ్యాటరీలు, రెండు బ్లాస్ట్ ఫర్నేసులు, రెండు సింటర్ ప్లాంట్లు మూత
- ప్రమాదకర వాయువులు వెలువడే అవకాశం
- కార్మిక సంఘాల నేతల ఆందోళన
- మరోవైపు విద్యుత్ బిల్లు చెల్లించాలని ఈపీడీసీఎల్ ఒత్తిడి
- మార్చి నెల జీతాలు ఇప్పటికీ 50 శాతం మాత్రమే చెల్లింపు - వార్త II పేజీలో

ప్రత్యామ్నాయ మార్గాలు ఆలోచిస్తున్నాం

- స్టీల్‌ప్లాంటుకు నిరంతరాయంగా ముడిపదార్థాలు సరఫరా అయ్యేలా ప్రణాళిక
- సీఎండీ అతుల్‌భట్

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 18: బొగ్గు సమస్య నుంచి బయటపడేందుకు ప్రత్యామ్నాయ మార్గాల్లో ముందుకు వెళుతున్నట్టు ఉక్కు యాజమాన్యం గురువారం ఒక ప్రకటనలో తెలియజేసింది. ప్లాంటు ప్రస్తుతం సురక్షిత నిర్వహణలో ఉన్నట్టు పేర్కొంది. అదానీ గంగవరం పోర్టులో కార్మికులు చేస్తున్న సమ్మె వల్ల ఉత్పత్తికి అడ్డంకులు ఎదురవుతున్నట్టు వెల్లడించింది. అయితే వాటిని అధిగమించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపింది. జిల్లా యంత్రాంగం సహకారంతో గంగవరం పోర్టులో ఉన్న కోకింగ్ కోల్‌ను విశాఖ పోర్టుకు తరలించేందుకు చర్యలు చేపట్టినట్టు యాజమాన్యం పేర్కొంది. ప్లాంటుకు ముడి పదార్థాల నిరంతర సరఫరా కోసం సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతున్నట్టు స్టీల్‌ప్లాంటు సీఎండీ అతుల్‌భట్ పేర్కొన్నారు. గంగవరం పోర్టులో అంతరాయాల దృష్ట్యా ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్లాంటుకు అవసరమైన బొగ్గును తీసుకొచ్చేందుకు కృషిచేస్తున్నామన్నారు. సమస్య పరిష్కారానికి మార్గనిర్దేశనం చేసిన ఉక్కు మంత్రిత్వశాఖకు, దృఢమైన మద్దతు తెలిపినందుకు జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్లకు సీఎండీ కృతజ్ఞతలు తెలిపారు.

బతుకులు కుదేలు

అప్పుల్లో భవన నిర్మాణ రంగ కార్మికులు

- వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఇసుక విధానంలో మార్పులు
- నాటి నుంచే ఇబ్బందులు ప్రారంభం
- ధర పెరగడంతో పాటు తగినంత లభ్యంకాని పరిస్థితి
- ఇటుక, స్టీల్, సిమెంట్ ధరలు కూడా భారీగా పెరగడంతో నిర్మాణాలు మందగమనం
- కార్మికులకు తగ్గిన పనులు
- వారంలో కనీసం రెండు రోజులు కూడా పని దొరకడం లేదని ఆవేదన
- అప్పులు చేసి జీవనం



పనుల కోసం భవన నిర్మాణ కార్మికుల ఎదురుచూపులు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

పదిహేనేళ్ల నుంచి భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నా. గతంలో ఎన్నడూ లేని విధంగా గడిచిన ఐదేళ్ల నుంచి పనుల కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. వారంలో రెండు, మూడు రోజులు కూడా పని దొరకడం లేదు. ఇటుక, ఇసుక ధరలు పెరిగిపోవడం, ఇతర ఇబ్బందులతో నిర్మాణ రంగం కుదేలైపోయింది. అదే మా పాలిట శాపంగా మారింది. కొత్తగా తెచ్చిన ఇసుక విధానం, ఆ తరువాత వచ్చిన కరోనా భవన నిర్మాణ రంగంలోని కార్మికుల జీవితాలను అధఃపాతాళానికి తొక్కేశాయి. - వెంకోజీపాలెం ప్రాంతానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు సత్తెయ్య ఆవేదన.

భవన నిర్మాణ రంగ కార్మికులను ఎవరిని కదిపినా ఇదే రకమైన బాధను వ్యక్తం చేస్తున్నారు. గడిచిన ఐదేళ్లలో భవన నిర్మాణ కార్మికుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నూతన విధానం పేరుతో ఇసుక సరఫరాలో మార్పులు తెచ్చింది. దీంతో ధర భారీగా పెరిగిపోయింది. అంతేకాకుండా నిర్మాణాలకు తగినంత స్థాయిలో ఇసుక లభించకపోవడంతో పనులు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో భవన నిర్మాణ రంగ కార్మికులకు కష్టాలు మొదలయ్యాయి. గతంలో వారంలో కనీసం ఐదు రోజులు పని దొరికేదని, గడిచిన ఐదేళ్ల నుంచి కనీసం రెండు రోజులు కూడా పని దొరకడం కష్టంగా మారిందని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గడిచిన 20 ఏళ్లుగా ఇదే రంగంలో పనిచేస్తున్న తాను...ఇటువంటి పరిస్థితిని ముందెన్నడూ చూడలేదని శ్రీకాకుళం జిల్లా పాలకొండ ప్రాంతానికి మహాలక్ష్మి చెప్పింది. పనులు దొరక్కపోవడంతో కుటుంబాలను పోషించుకోవడం ఇబ్బందిగా మారిందని, అప్పులు చేసి మరీ బతుకులు ఈడుస్తున్నామని ఆమె వాపోయింది.

వేలాది మంది భవన నిర్మాణ కార్మికులు

విశాఖ నగర పరిధిలో భవన నిర్మాణ రంగంపై ఆధారపడి లక్ష మందికిపైగా కార్మికులు ఉన్నారు. వీరంతా కూలీలు, తాపీమేస్త్రీలు, పరంజీ మేస్త్రీలుగా, సెంట్రింగ్ వర్క్, టైల్స్, వుడ్ వర్క్ వంటి పనులు చేస్తుంటారు. వీరు చేసే పనిని బట్టి మహిళలకు రోజుకు రూ.500, పురుషులకు అయితే రూ.700 నుంచి రూ.వేయి వరకు చెల్లిస్తుంటారు. వీరంతా వెంకోజీపాలెం, ఆరిలోవ, ఇసుకతోట, మద్దిలపాలెం, సీతమ్మధార, సీతంపేట, ఎన్ఏడీ, అక్కయ్యపాలెం, గాజువాక తదితర ప్రాంతాల్లో ... మిగతా 6వ పేజీలో

15 రోజుల నుంచి పని దొరకలేదు



మాది విజయనగరం జిల్లా పోరాం గ్రామం. పదిహేనేళ్ల కిందట వైజాగ్ వచ్చేశాం. భవన నిర్మాణ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. గడిచిన కొన్నాళ్ల నుంచి పనులు చేద్దామన్నా దొరకడం లేదు. గత 15 రోజులుగా క్యారేజీ పట్టుకుని రావడం, వెళ్లడం... ఒక్కరోజైనా పని దొరకకపోతుందా అనే ఆశతో ఆరిలోవ నుంచి రోజుకు రూ.40 చార్జీలు పెట్టుకుని వస్తున్నా. చార్జీలు ఖర్చు తప్ప పని లేదు. ఒక్కరోజు పని దొరికినా రూ.500 వస్తుందన్న ఆశ. పను లేకపోవడంతో ఇంటి ఖర్చులకు ఇబ్బంది అవుతోంది. మా ఇంటాయనకు కూడా పని దొరకడం లేదు. ఇంటి అద్దె, ఇతర ఖర్చుల కోసం ఊళ్లో తెలిసిన వాళ్ల దగ్గర డబ్బులు తెచ్చుకుంటున్నాం. ఎన్నడూ లేనివిధంగా నాలుగేళ్లుగా ఇబ్బంది పడుతున్నాం. - బి.లక్ష్మి, రోజు కూలీ

కుటుంబ పోషణ కష్టమవుతోంది



మాది శ్రీకాకుళం జిల్లా మరువాడ. ఇరవై ఏళ్ల కిందట నగరానికి వచ్చేశాం. మా ఇంటాయనతో కలిసి భవన నిర్మాణ పనులకు వెళుతుండేదాన్ని. గత కొన్నాళ్ల నుంచి పనులు దొరకడం లేదు. ప్రతిరోజూ కామత్ హోటల్ దగ్గర నుంచి చార్జీ పెట్టుకుని ఇసుకతోట జంక్షన్‌కు రావడం, పనులు దొరకపోవడంతో మళ్లీ వెనక్కి వెళ్లిపోవడం.. ఇదే తంతు. పనులు లేకపోవడంతో మా ఇంటాయన వాచ్‌మన్‌గా చేరిపోయాడు. ఉండడానికి చిన్న గది ఇచ్చారు. దీంతో అద్దె, కరెంట్ బిల్లు వంటి ఖర్చులు తప్పాయి. నెలకు కొంత ఆదాయం వస్తోంది. కానీ, ఇతర ఖర్చులకు అప్పులు చేస్తున్నాం. ఇంకా ఎన్ని రోజులు ఇదే పరిస్థితి ఉంటుందో అర్థం కావడం లేదు.

- కె.కమలమ్మ, రోజువారీ కూలీ

ఈ ఇబ్బందులు ఇంకెన్నాళ్లో...



మాది విజయనగరం జిల్లా బొబ్బిలి. పదేళ్ల కిందట కుటుంబంతో సహా వైజాగ్ వచ్చేశాను. అప్పట్లోనే డిగ్రీ పూర్తిచేశాను. ఉద్యోగం రాకపోవడంతో తాపీ పనిలో చేరిపోయాను. గతంలో నెలకు 20 రోజులకుపైగా పని దొరికేది. గత కొన్నాళ్ల నుంచి రెండు, మూడు రోజులు కూడా దొరకడం లేదు. అసలు పనికి పిలిచే వారు కరువైపోయారు. సాధారణంగా తాపీమేస్త్రీకి వేయి ఇస్తారు. రూ.700 ఇచ్చి నా వస్తామన్నా ఎవరూ పిలవడం లేదు. ఆర్థిక ఇబ్బందులతో అల్లాడిపోతున్నాం. బంధువులు, తెలిసిన వాళ్ల దగ్గర అప్పులు వాడేశా ను. ఇప్పుడు వడ్డీకి తీసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నా. దేవుడి మాన్యం పండిస్తున్నా. ఆ బియ్యం వండుకుని తింటున్నాం. ఇతర ఖర్చులకు అప్పులు చేస్తున్నా. ఇంకా ఎన్నాళ్లు ఈ ఇబ్బం దులు ఉంటాయో అర్థం కావడం లేదు.

- బొంగు రఘుపతినాయుడు, తాపీమేస్త్రీ

ఏసీబీ వలలో పంచాయతీ కార్యదర్శి

ఇంటి పన్ను కోసం లంచం డిమాండ్

పెందుర్తి, ఏప్రిల్ 18: ఇంటికి పన్ను వేసేందుకు రూ.8 వేలు లంచం తీసుకుంటూ ఓ పంచాయతీ కార్యదర్శి, ఆయన సహాయకుడు గురువారం అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కారు. ఇందుకు సంబంధించి బాధితుడు అందజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖ నగర వాసి ఒకరికి మండలంలోని వాలిమెరకజుత్తాడలో ఇల్లు ఉంది. అది ఆయన తల్లి పేరిట ఉంది. ఆ ఇంటికి పన్ను నిర్ధారిత పత్రం కోసం ఆయన దరఖాస్తు చేసుకున్నారు. అందుకోసం రూ.8 వేలు లంచం ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శి వి.సత్యనారాయణ డిమాండ్ చేశారు. లంచం ఇవ్వడం ఇష్టం లేని నగర వాసి...ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారి సూచన మేరకు బాధితుడు గురువారం పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి సత్యనారాయణ, ఆయన సహాయకుడు కొర్ర విక్టర్ ప్రవీణ్‌లకు రూ.8 వేలు అందజేశారు. అదే సమయంలో ఏసీబీ అధికారులు కార్యాలయంలో ప్రవేశించి రెడ్‌హ్యాండెడ్‌గా కార్యదర్శిని పట్టుకున్నారు. పంచాయతీ కార్యదర్శి తనను రూ.8 వేలు డిమాండ్ చేయగా, తాను రూ.3 వేలు ఇస్తానన్నానని,రూ.8 వేలు ఇవ్వకపోతే ఇంటి పన్ను వేసేది లేదని చెప్పడంతో ఏసీబీ కాల్ సెంటర్‌కు ఫిర్యాదు చేసినట్టు బాధితుడు తెలిపారు. కాల్‌సెంటర్‌కు వచ్చిన ఫిర్యాదును నమోదు చేసుకుని డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు విశాఖ అధికారులు ఈ దాడులు నిర్వహించారు.



పట్టుబడ్డ పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, సహాయకుడు విక్టర్ ప్రవీణ్

నేడు అప్పన్న తిరు కల్యాణోత్సవం



విద్యుత్ కాంతులతో దేదీప్యమానంగా ప్రకాశిస్తున్న సింహగిరి

- వార్త I పేజీలో

జన చైతనం

- దటీజ్ దిమిలి!
- ఓటరు మాట
- అనుమతులన్నీ సువిధలోనే!

విశాఖ తూర్పు... విశిష్టం!

- మేధావులు, విద్యావంతులకు నిలయం
- మూడు దఫాలుగా టీడీపీకి తగ్గని ఆదరణ

8లో

టీడీపీలో చేరిన అక్కరమాని దంపతులు

విశాఖపట్నం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): విశాఖ మెట్రో రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్‌డీఏ) మాజీ ఛైర్‌పర్సన్, తూర్పు నియోజకవర్గ వైసీపీ మాజీ ఇన్‌చార్జి అక్కరమాని విజయనిర్మల, ఆమె భర్త వెంకటరావు గురువారం తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి అధినేత నారా చంద్రబాబునాయుడు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.అక్కరమాని విజయనిర్మల 2019 ఎన్నికల్లో తూర్పు అసెంబ్లీ స్థానానికి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. ఆ తరువాత ఏడెనిమిది నెలల కిందట వరకూ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్నారు. విజయనిర్మల దంపతులతో పాటు పద్మనాభం మాజీ ఎంపీపీ గోపీ రాజు, విశాఖ జిల్లా చిరంజీవి సేవా సంఘం అధ్యక్షులు దుక్క కృష్ణాయాదవ్, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఒమ్మి దేవుడు, మాజీ సర్పంచులు గేదెల చంద్రరావు, నమ్మి వెంకటరావు, జీవీఎంసీ 25వ వార్డు వైసీపీ అధ్యక్షుడు జి.సూర్యబాబు టీడీపీలో చేరారు.



సమ్మర్ క్యాంపు

డాబాగార్డెన్స్: చిల్డ్రన్స్ సమ్మర్ క్యాంప్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.అనంతరం ఆసరా చారిటబుల్ సొసైటీ , గౌతు లచ్చన్న ఆర్గనైజేషన్ ఫర్ వీకర్ సెక్షన్స్ సంస్థలు బుక్స్, స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ చేశాయి. ఈ క్యాంప్ ఈనెల 25నుంచి మే 10వరకు ఉంటుందని నిర్వాహకులు సునీత, వెంకటగిరి తెలిపారు.










జనసేన పార్టీలో చేరిన వారితో దక్షిణ నియోజకవర్గ కూటమి అభ్యర్థి వంశీకృష్ణ



మహారాణిపేటలో సందీప్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు

కూటమి అభ్యర్థుల గెలుపుతోనే అభివృద్ధి సాధ్యం

» 'దక్షిణ' జనసేన అభ్యర్థి వంశీకృష్ణ
» జనసేనలో భారీగా వైసీపీ శ్రేణులు చేరిక

పూర్ణామార్కెట్, ఏప్రిల్ 18: దక్షిణంలో కూటమి అభ్యర్థులను గెలిపించి అభివృద్ధికి దోహదపడాలని జనసేన అభ్యర్థి వంశీకృష్ణ కోరారు. గురువారం గ్రేటర్ 31వ వార్డు ఎల్లమ్మతోటలో వైసీపీకి చెందిన కనకవల్లి, సూర్యాదేవి, ఉషమ్మ, మంగ, విజయలక్ష్మి, సూర్యాదేవి, గురుతల్లి, నీలిమ, పల్లాచిట్టెమ్మ లక్ష్మి, జయశ్రీ, అశ్వని, గౌరి, రూప, గోపి, సాయి తదితర 50 కుటుంబాలు వంశీకృష్ణ సమక్షంలో జనసేనలో చేరారు. అలాగే, 35వ వార్డు చిన దుర్గాలమ్మగుడి, పండావీధికి చెందిన యువకులు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. బ్యారెక్స్ వద్ద ఫుట్‌పాత్ వ్యాపార సంఘాల ప్రతినిధులు కాకరరాజు, వంక శ్రీను. బి. రాంబాబు, వినోద్, చంద్రశేఖర్, ఖాన్ అహ్మద్, నాని, ఎం.భాస్కర్ బుజ్జి, ప్రసాద్, హేమంత్‌కుమార్, ప్రసాద్, రామస్వామి తదితర 100 మంది జనసేనలో చేరారు. ఆపార్టీ అధ్యక్షుడు లెంక త్రినాథ్, రఘ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికీ వంశీకృష్ణ కండువాలు వేసి స్వాగతంపలికారు. రానున్న ఎన్నికల్లో ఇదే ఉత్సాహంతో పనిచేసి ఎంపీ అభ్యర్థి శ్రీభరత్‌కు సైకిల్‌గుర్తుపై, జనసేన గాజు గుర్తు గ్లాస్‌కుఓటేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పిల్లి రమణ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, యువకులు పాల్గొన్నారు.

జగదాంబ కూడలి/ మహారాణిపేట ఏప్రిల్ 18: దక్షిణ నియోజకవర్గ కూటమి అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ ఎన్నికల్లో గెలిపించాలని ఆయన తనయుడు సందీప్ ప్రజలను అభ్యర్థించారు. గురువారం ఆయన 29వ వార్డు సూర్యహాస్పిటల్, బీచ్ రోడ్డుతో పలు ప్రాంతాల్లో పర్యటించి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గంలో అభివృద్ధికి, ప్రజల ఆకాం క్షలకు అనుగుణంగా సేవలందిస్తారన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. జనసేన, టీడీపీ, బీజేపీ వార్డు స్థాయి నాయకులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

కేజీహెచ్ రోగుల సహాయకులకు ఉచిత భోజనాలు



భోజన పథకం ప్రారంభిస్తున్న నిర్వాహకులు, వైద్యాధికారులు

మహారాణిపేట, ఏప్రిల్ 18: కేజీహెచ్‌లో రోగులకు సహాయంగా వచ్చే వారికి ఇకపై ఏడాది పాటు ఉచితంగా భోజనాలు అందించనున్నట్టు హరేకృష్ణా మూవ్‌మెంట్ అధ్యక్షుడు ఎస్. భక్తదాస తెలిపారు. హరేకృష్ణా మూవ్‌మెంట్ అండ్ టచ్‌స్టోన్ సంస్థ ఆధ్వర్యంలో సుభోజనం పేరుతో గత 12 సం వత్స రాలుగా రోగుల సహాయకులు, వారి బంధువులకు నామమాత్ర ధరకే మూ డు పూటలా భోజనం అందిస్తోంది. ఈ కార్యక్రమం ప్రాముఖ్యతను తెలు సు కున్న ఇండో ఎమ్‌ఐఎం ప్రైవేట్ సంస్థ ఒక ఏడాదిపాటు ఉచితంగా భోజనం అందించేందుకు విరాళం అందించింది. ఈ సందర్భంగా గురువారం ఇండో ఎ మ్‌ఐఎం సంస్థ సీఈవో విజయ్‌కుమార్ ఈ భోజన వితరణ కార్యక్ర మాన్ని ప్రారంభించారు. రోజూ మధ్యాహ్నం 400 మందికి ఉచితంగా భోజనం అందించనున్నారు. అలాగే, ఉద యం అల్పాహారం, రాత్రి భోజనం సైతం వడ్డించనున్నారు. ఈ కార్యక్రమంలో డీఎం ఈ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు, సూపరిం టెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గంగవరం పోర్టు కార్మికుల సమస్య పరిష్కరించాలి : సీపీఐ



మాట్లాడుతున్న సీపీఐ నేత సత్యనారాయణ మూర్తి

అల్లిపురం, ఏప్రిల్ 18: గంగవరం పోర్టు కార్మికుల సమస్యలను తక్షణమే యాజమాన్యం పరిష్కరిం చాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి డిమాండ్ చేశారు. గురువారం అల్లిపురంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వారం రోజులుగా పనికి తగిన సమాన వేతనం కోసం కార్మికులంతా పో రాటం చేస్తున్నా యాజమాన్యం పట్టించుకోకుండా వ్యవహరిస్తోందన్నారు. య జమాన్యం శ్రమదోపిడీతో లాభాలు ఆర్జిస్తున్నా కార్మికులకు రూ. 15వేల లోపు మాత్రమే వేతనాలు ఇస్తూ అన్యాయం చేస్తోందన్నారు. పోర్టు కార్మికులకు ఇ చ్చినట్టే గంగవరం పోర్టు కార్మికులకూ కనీస వేతనం రూ. 36వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

తొలిరోజు రెండు నామినేషన్లు దాఖలు



తహసీల్దార్ కార్యాలయం ఎదుట పోలీసుల బందోబస్తు

సీతమ్మధార, ఏప్రిల్ 18: సార్వత్రిక ఎన్నికలకు ఉత్తర నియోజకవర్గానికి సంబంధించి స్థానిక అర్బన్ తహసీల్దార్ కార్యాలయాన్ని సిద్ధం చేశారు. రిటర్నింగ్ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి.అఖిల, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ జి.శ్రీరామ మూర్తి సిబ్బందితో సహా అభ్యర్థులనుంచి నామినేషన్ల పత్రాలను గురువారం స్వీకరించారు. తొలిరోజు భారత నిర్మాణ సేవా పార్టీ నుంచి చింతాడ సూర్యం, జాతీయ జనసేన పార్టీ నుంచి పి.జగదీష్ వీరిద్దరు నామినేషన్ పత్రాలను సమర్పించారు. కార్యాలయ ఆవరణలో ద్వారకా పోలీసు స్టేషన్ సీఐ ఎస్.రమేశ్, ఎస్ఐ ధర్మేంద్ర సిబ్బంది ప్రత్యేక బందోబస్తు చేపట్టారు.

51వ వార్డులో జైభారత్ పార్టీ ప్రచారం



చిన్నారికి లెక్కలు బోధిస్తున్న అభ్యర్థి లక్ష్మీనారాయణ

మురళీనగర్, ఏప్రిల్ 18; 51వవార్డు మాధవధార గాంధీనగర్‌లో గురువారం జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షులు, ఉత్తరం అభ్యర్థి వి.వి. లక్ష్మీనారాయణ ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా చిట్టిబాబు కాలనీలోని ఓ ఇంట్లో పదో తరగతి చదువున్న విద్యార్థినితో మాటామంతీ కలిపారు.చదువు సాగుతున్న తీరుపై అడిగితెలుసుకున్నారు. ఆ చిన్నారికి పదో తరగతి లెక్కల సబ్జెక్టులో వచ్చిన సందేహాన్ని నివృత్తి చేశారు. చదువుపై విద్యార్థులు పూర్తి శ్రద్ధ కనపరచాలని ఈసందర్భంగా లక్ష్మీనారాయణ విద్యార్థికి సూచించారు. ప్రచారంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి: ఆర్వో



మాట్లాడుతున్న ఆర్వో హుస్సేన్ సాహెబ్

జ్ఞానాపురం, ఏప్రిల్ 18: ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని పశ్చిమ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో డి.హుస్సేన్ సాహెబ్ అన్నారు. గురువారం స్థానిక పశ్చిమ నియోజకవర్గం ఆర్వో కార్యాలయం సమావేశ మందిరంలో ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, ఎంసీసీ, వీఎస్‌టీ టీమ్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ బృందాలు ఎటువంటి ఒత్తిళ్లకు లొంగకుండా పనిచేయాలని సూచించారు. వచ్చిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించాలన్నారు. అన్ని ప్రదేశాల్లో రాత్రి వేళల్లో గస్తీ నిర్వహిస్తూ ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూసుకోవాలని ఆదేశాంచారు.

వైభవంగా సీతారాముల పట్టాభిషేకం



పూజలు చేస్తున్న భక్తులు

సీతమ్మధార, ఏప్రిల్ 18 : సీతంపేటలోని పార్వతీశ్వరాలయంలో శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా గురువారం సీతారాముల పట్టాభిషేకాన్ని నిర్వహించారు. సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడుశ్రీనివాసరావు దంపతులున్నారు.

ఇంటర్ సర్వీసెస్ వాటర్‌పోలో చాంపియన్ నేవీ



చాంపియన్ షిప్ సాధించిన ఇండియన్ నేవీ జట్టు సభ్యులు

విశాఖపట్నం, ఏప్రిల్ 18: ఇంటర్ సర్వీసెస్ వాటర్‌పోలో చాంపియన్ షిప్ పోటీలు గురువారం డాల్ఫిన్‌హిల్స్ స్విమ్మింగ్ పూల్‌లో జరిగాయి. ఈ పోటీలో ఇండియన్ నేవీ జట్టు విజేతగా నిలిచింది. పోటీల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సబ్‌మెరైన్స్ ఫ్లాగ్ ఆఫీసర్ రియర్ అడ్మిరల్ కె.వెంకట్రామన్ ముఖ్యఅతిథిగా హాజరై విజేత జట్టుకు ట్రోఫీని అందజేశారు.

కనకమహాలక్ష్మికి పంచామృతాభిషేకాలు



జగదాంబ కూడలి, ఏప్రిల్ 18: వన్‌టౌన్ బురుజుపేటలోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో త్రికాల పంచామృతాభిషేక సేవలను గురువారం ఉభయ దాతలతో అర్చ కులు జరిపించారు. 10మంది ఉభయదాతలు ఈ పూజల్లో పాల్గొన్నారు. పూజల అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం అమ్మవారికి కుంకుమపూజలుజరిపి, ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈవో శ్రీనివాసుల రెడ్డి తెలిపారు.

లారీ ఢీకొని మహిళ మృతి

» కుమారుడికి గాయాలు
» ప్రమాదం నుంచి బయట పడిన భర్త, కుమార్తె



ప్రమాదంలో మృతి చెందిన శివేశ్వరి

లంకెలపాలెం, ఏప్రిల్ 18: పిల్లలతో కలిసి ద్విచక్ర వాహనంపై వెళుతున్న భార్యాభర్తలకు గుర్తు తెలియని లారీ ఢీకొంది. ఘటనలో భార్య అక్కడిక్కడే ప్రాణాలు విడిచింది. కుమారుడికి గాయాలు కాగా భర్త, కుమార్తె ప్రమాదం నుంచి బయట పడ్డారు. లంకెలపాలెం వద్ద గురువారం రాత్రి ఈ ప్రమాదం చోటు చేసుకున్న ఈ ఘటనపై పరవాడ పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. ఫార్మాసిటీలోని లారస్ ల్యాబ్స్‌లో పనిచేస్తున్న తలశిల అనీల్‌కుమార్, పెదముషిడివాడలో కుటుంబ సభ్యులతో నివాసముంటున్నాడు. భార్య శివేశ్వరి (34) కుమారుడు నిఖిల్ (8) కుమార్తె జశ్విక నలుగురు కలిసి బైక్‌పై అగనంపూడి పండగ కోసం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వస్తుండగా లంకెలపాలెం పెట్రోల్ బంకు సమీపంలోకి వచ్చేసరికి వెనుక నుంచి గుర్తు తెలియని లారీ వేగంగా వచ్చి ఢీకొంది. ఈప్రమాదంలో భార్య శివేశ్వరి వెనక్కి పడడంతో లారీ చక్రాలు ఆమె తలపై నుంచి వెళ్లి సంఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచారు. కుమారుడు నిఖిల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. భర్త అనిల్‌కుమార్, కుమార్తె జశ్విక ప్రమాదం నుంచి బయటపడ్డారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు



విద్యార్థులతో ఈకార్వో ప్రతినిధులు

విశాఖపట్నం, ఏప్రిల్ 18: వార్షిక పరీక్షల్లో ప్రతిభ కనబరిచినరైల్వే ఉద్యోగుల పిల్లలకు తూర్పుకోస్తా రైల్వే మహిళా సంక్షేమ సంఘం వాల్తేరు శాఖ (ఈకార్వో) స్కాలర్‌షిప్‌లు అందజేసింది. గురువారం జరిగిన ఈ కార్యక్రమానికి ఈకార్వో అధ్యక్షురాలు మంజుశ్రీ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై టెన్త్, ఇంటర్మీడియట్, మెడికల్, ఇంజనీరింగ్, ఐఐటీ వంటి వివిధ పోటీ పరీక్షలలో ప్రతిభ చూపిన 40 మందికి స్కాలర్‌షిప్‌లు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా మరింత రాణించాలని ఆకాంక్షించారు. తమ సహకారం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈకార్వో ప్రతినిధులు కమితా గుప్తా, మధుస్మిత సాహుపాల్గొన్నారు.

'చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి'

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 18: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతుందని జీవీఎంసీ 31వ వార్డు ఆపార్టీ నాయకులు బత్తిన నవీన్‌కుమార్ అన్నారు. గురువారం వార్డులో దక్షిణ నియోజకవర్గ కూటమి అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్‌యాదవ్, ఎంపీ అభ్యర్థి శ్రీభరత్‌కు మద్దతుగా ఆర్‌టీక్లబ్, గొల్లలపాలెం ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం చేపట్టారు.ఈ కార్యక్రమంలో ఆర్‌జీ రాజేష్, నక్కావేణు, మణికంఠ, జితేందర్, పెదిరెడ్ల అప్పలరాజు, ఆర్‌జీ శంకరరావు, పూడి రమేష్, కృష్ణ, వరలక్ష్మి, సరస్వతి, టీడీపీ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం



లాలం సతీష్, మాధవ్‌కుమార్ (ఫైల్)

పెద్దాపురం, ఏప్రిల్ 18: పెద్దాపురం- రాజమహేంద్రవరం ఏడీబీ రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందగా మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనకాపల్లికి చెందిన లాలం సతీష్ (20), విశాఖపట్టణానికి చెందిన బర్రి మాధవ్‌కుమార్ (19), శ్రీకాకుళం జిల్లా చిగురువలసకు చెందిన రామచంద్రరావు కాకినాడ జిల్లా పెద్దాపురం వచ్చారు. మోటార్ సైకిల్‌పై రూముకు వెళుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో మాధవ్, సతీష్ అక్కడికక్కడే మృతిచెందగా రామచంద్రరావు తీవ్రంగా గాయపడ్డాడు. బైక్‌ను ఢీకొట్టిన వాహనం ఆగకుండా వెళ్లిపోయింది. యువకులు రామేశంపేటలో గది అద్దెకు తీసుకుని ఇంజనీరింగ్ చదువుతున్నారు. క్షతగాత్రుడ్ని స్థానిక ఆస్పత్రికి, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించి ఎస్ఐ సురేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కేజీహెచ్‌లో అంకాలజీ ఐసీయూ ఏర్పాటు

మహారాణిపేట, ఏప్రిల్ 18: కేజీహెచ్ లో (మెడికల్ అంకాలజీ) కేన్సర్ రోగుల కోసం ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌ను గురువారం డైరె క్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ డీవీఎస్ఎల్ నరసింహం ప్రారంభించారు. అంకాలజీ వి భాగంలో ప్రత్యేకంగా (ఎక్యూట్ లుకేమియా) బ్లడ్ కేన్సర్ రోగులకు ఈ ఐసీయూ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా క్టర్ బుచ్చిరాజు, సూపరింటెండెంట్ అశోక్‌కుమార్, అంకాలజీ హెచ్‌వోడీ శిల్ప, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌లో టికెట్ల కేటాయింపుపై అసంతృప్తి'

మహారాణిపేట, ఏప్రిల్ 18: కాంగ్రెస్ పార్టీతో సంబంధం లేని వ్యక్తులకు ఈ సారి ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లు కేటాయించినట్టు కాంగ్రెస్ సెల్ విశాఖ జిల్లా చైర్మన్ కొణతాల శ్రీనివాస్ అన్నారు. గురువారం స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో అసెంబ్లీ, పార్లమెంట్ సంబంధించి టికెట్ల కేటాయింపుపై పార్టీ నాయకులు, కార్యకర్తలు పూర్తి అసంతృప్తితో ఉన్నారన్నారు. పార్టీ పూర్వ వైభవం కోసం కష్టపడుతున్న వారిని వదిలేసి ఏ ప్ర యోజనాన్ని ఆశించి ఇతరులకు టికెట్లు కేటాయించారని ఆయన ప్రశ్నించారు. ఈ విషయంలో ఏఐసీసీ పెద్దలకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

ఎన్నికల ముగిసే వరకు ఇంతేనా?

» బస్ బే పై సీఎం స్టిక్కర్



సౌత్‌ఎంటీసీ పాలెం బస్‌బేపై మెరిసిపోతున్న సీఎం స్టిక్కర్

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 18: నాలుగు లేన్ల రహదారికి ఆనుకుని ఉన్న పోర్టు హాస్పిటల్ సౌత్ ఎంటీసీ పాలెం బస్ బేలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఫొటోతో కూడిన స్టికర్ ధగధగా మెరిసిపోతోంది. ఎన్నికల కోడ్ అమలులోకివచ్చి నెలరోజులవుతున్నా ఈస్టిక్కర్‌ను మూసి వేతపై అధికారులు సక్రమంగా చర్యలు తీసుకోలేదు. దీంతో సీఎం ఫొటో ఉన్న ప్రచార స్టికర్ స్పష్టంగాకనిపిస్తోంది. ఓటర్లను ప్రభావితం చేసే లా ఉన్న ఈ స్టిక్కర్‌ను అధికారులు స్పందించి కనిపించకుండా చేయాలని పలు పార్టీల నేతలు కోరుతున్నారు.

నామినేషన్ల సందడి



కలెక్టర్‌కు నామినేషన్ పత్రాలు అందిస్తున్న కేఏ పాల్

... 5వ పేజీ తరువాయి

వరకు (ఆదివారం తప్ప) ప్రతిరోజు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్టు అధికారులు తెలిపారు.

అసెంబ్లీ స్థానాలకు ఏడుగురు నామినేషన్లు...

తొలిరోజు జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలకుగాను భీమిలి, విశాఖ ఉత్తరం, గాజువాక, పెందుర్తి సెగ్మెంట్‌లకు ఏడుగురు నామినేషన్లు దాఖలు చేశారు. భీమిలి అసెంబ్లీకి తెలుగుదేశం తరఫున గంటా శ్రీనివాసరావు, ఆయన కుమారుడు రవితేజ రెండేసి సెట్లు నామినేషన్లు భీమిలి ఆర్డీవో భాస్కరరెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమానికి టీడీపీతో పాటు జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరయ్యారు. ఇంకా విశాఖ ఉత్తరం నియోజక వర్గానికి నవభారత నిర్మాణ సేవ పార్టీ తరఫున చింతాడ సూర్యం, జాతీయ జనసేన పార్టీ తరఫున పి.జగదీష్‌లు సీతమ్మధార తహసీల్దారు కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి అఖిల వద్ద నామినేషన్లు సమర్పించారు. గాజువాక అసెంబ్లీకి జాతీయ జనసేన పార్టీ తరఫున పల్లి శ్రీనివాసరావు, పిరమిడ్ పార్టీ తరఫున పెబ్బులి సత్యనారాయణమూర్తిలు గాజువాక తహసీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి లక్ష్మారెడ్డికి, పెందుర్తి అసెంబ్లీ సీటుకు బీఎస్పీ అభ్యర్థిగా బంగారు రమణ పెందుర్తి తహసీల్దారు కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి పి. శేషశైలజ వద్ద నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులు అనంతరం ప్రమాణం చేశారు.

బతుకులు కుదేలు

... 5వ పేజీ తరువాయి

నివాసం ఉంటారు. తాము నివాసం ఉండే ప్రాంతాలకు దగ్గరలోని ప్రధాన కూడళ్ల వద్దకు ఉదయాన్నే క్యారేజీలు పట్టుకుని వెళ్లి నిల్చుంటారు. అక్కడకు వర్కర్ మేస్త్రీలు, నిర్మాణ పనులు చేసుకునే కాంట్రాక్టర్లు వచ్చి రోజు కూలీ ప్రాతిపదికన వీరిని తీసుకుని వెళుతుంటారు.

నిలిచిన నిర్మాణాలతో ఇబ్బందులు..

గతంలో నిర్మాణ పనులు చేసే వారికి ఎంత కావాలంటే అంత ఇసుక లభించేది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇసుక విధానంలో మార్పులు చేసింది. దీంతో ఇసుక లభ్యత తగ్గిపోయింది. ఇసుక కొనుగోలు చేయడం నిర్మాణదారులకు కత్తి మీద సాములా మారింది. అదే సమయంలో ఇసుక, ఇటుక ధర కూడా భారీగా పెరిగిపోవడంతో పనులు మందగించాయి. గతంలో ఆటో ఇసుక రూ.500 ఉంటే, ఇప్పుడు రూ.2,000, రూ.3,000 వరకూ వసూలు చేస్తున్నారని, అలాగే ఇటుక గతంలో మూడు రూపాయలు ఉంటే, ప్రస్తుతం అది రూ.10 అయ్యిందని, దీంతో పనులు తగ్గాయని కార్మికులు వాపోతున్నారు. వీటితోపాటు పెరిగిన స్టీల్, సిమెంట్ ధరలు కూడా నిర్మాణ రంగంలోని పనులపై ప్రభావం చూపించాయని, దీంతో తమకు పనులు దొరకకుండా పోయాయని విజయనగరం నుంచి వచ్చి ఆరిలోవలో నివాసం ఉంటున్న రాజారావు అనే తాపీమేస్త్రీ ఆవేదన వ్యక్తం చేశారు.

అప్పులు చేసి జీవనం

గతంలో ఇంటి నుంచి క్యారేజీ పట్టుకుని రోడ్డెక్కితే పని దొరికేదని, ఎప్పుడో నెలలో ఒకటి, రెండుసార్లు పనుల్లేక ఇంటికి వెళ్లేవాళ్లమని, కానీ, గడిచిన కొన్నాళ్ల నుంచి వారంలో ఒకటి, రెండు రోజులు పని దొరకడం కష్టంగా మారుతోందని లక్ష్మణ్ అనే సెంట్రింగ్ వర్కర్ వాపోయాడు. ప్రతిరోజూ క్యారేజీ పట్టుకుని వెళ్లడం, పని దొరక్క ఉసూరుమంటూ రావడం జరుగుతోందన్నాడు. పనులు దొరక్క చాలామంది స్వగ్రామాలకు వెళ్లిపోయారని, ఉన్న వాళ్లలో కూడా ఎంతోమంది ప్రత్యామ్నాయ పనులు చూసుకుంటున్నారని రాజు అనే భవన నిర్మాణ కార్మికుడు వాపోయాడు. గతంలో తనతోపాటు భార్య కూడా పనికి వచ్చేదని, ఇప్పుడు రోజూ ఇసుకతోట జంక్షన్‌కు రావడం, పని లేకుండా వెనక్కి వెళ్లడం జరుగుతోందని, దాంతో రెండు నెలల కిందట ఓ ఇంటిలో పనికి కుదిరిందని వెల్లడించాడు. తనకు పని దొరకకపోయినా ఆమెకు వచ్చే డబ్బుతో ఇంటిని నడుపుతున్నామని, ఇతర ఖర్చులకు అప్పులు చేస్తున్నామని వాపోయాడు.

పెరిగిన ఖర్చులు

నెలంతా పని దొరికితేనే ఇంటిని నడపడం కష్టంగా ఉండేదని, అటువంటిది ఇప్పుడు వారానికి రెండు రోజులు కూడా పని దొరకకపోవడంతో అప్పులు చేస్తున్నామని భవన నిర్మాణ కార్మికులు వాపోతున్నారు. కొందరు కుటుంబ పోషణ కోసం రాత్రివేళల్లో వాచ్‌మెన్లు, సెక్యూరిటీ గార్డులుగా చేరుతున్నారు. పెరిగిన ఇంటి అద్దెలు, కరెంట్ చార్జీలు, నిత్యావసర సరకుల ధరలతో నెలకు కనీసం రూ.15 వేలు అయినా కుటుంబాన్ని పోషించుకునేందుకు కావాల్సి వస్తోందని, పనుల్లేకపోవడంతో కనీసం పది వేలైనా అప్పు చేయాల్సి వస్తోందని రామారావు అనే కూలీ వాపోయాడు. పిల్లలు చదువులకు, ఇతర ఖర్చులకు అప్పులు చేస్తున్నామని, గడిచిన మూడేళ్లలో రూ.2 లక్షలు అప్పు చేశానని వాపోయాడు.



శేషవాహనంపై శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారు

కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 18: జీవీఎంసీ 87వ వార్డు పరిధి రాజులపాలెంలో కల్యాణ వేంకటేశ్వరస్వామి 24వ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ప్రధాన అర్చకులు కోగంటి శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారికి విశేష అలంకరణ చేసి పంచామృతాభిషేకాలు చేశారు. శేషవాహనంపై ఉత్సవమూర్తులను ఆశీనులను చేసి పురవీధుల్లో కోలాటాల నడుమ ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పలుచోట్ల శ్రీరామ పట్టాభిషేకం..



గవరవీధి రామాలయంలో పూజలందుకున్న సీతారాములు

జీవీఎంసీ 87వ వార్డు పరిధి కణితి రామాలయంలో గురువారం శ్రీరామ పట్టాభిషేకం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మంత్రి, వైసీపీ గాజువాక అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్యతో పాటు తిప్పల దేవన్‌రెడ్డి, తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. వడ్లపూడిలోని గవరవీధి రామాలయంలో గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో, 88వ వార్డు గ్రీన్‌సిటీలో వైజాగ్ ప్రొఫైల్స్ ఆధ్వర్యంలో సీతారాముల సామ్రాజ్య పట్టాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు.

చెక్ పోస్టుల వద్ద జోరుగా తనిఖీలు

గాజువాక, ఏప్రిల్ 18: ఎన్నికల నేపథ్యంలో గాజువాకలోని పలుచోట్ల చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. గాజువాక ప్రధాన జంక్షన్‌లలో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి నిత్యం తనిఖీలు నిర్వహిస్తున్నారు. అగనంపూడి టోల్‌గేటు, డొంకాడ, కూర్మన్నపాలెం, గాజువాక, బీసీ రోడ్డు, పెదగంట్యాడ, శ్రీలానగర్, స్టీల్‌ప్లాంట్ వద్ద చెక్ పోస్టుల ఏర్పాటుతో పాటు నిరంతరం ఒక టీమ్ తనిఖీలు చేపడుతుంది. చెక్ పోస్టులను ఆయా పోలీస్ స్టేషన్ల సీఐలు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

ఉక్కు కాంట్రాక్టు కార్మికుల కోసం అదనపు గేట్లు

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 18: స్టీల్‌ప్లాంట్‌లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికుల కోసం అదనపు గేట్లు ఏర్పాటు చేయటంతో చాలా సులువుగా వారు కర్మాగారంలోకి ప్రవేశిస్తున్నారు. ప్లాంట్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులకు తప్పనిసరిగా బయోమెట్రిక్ అమలు చేయడంతో అదనపు గేట్ల ద్వారా కాంట్రాక్టు కార్మికులకు ప్రవేశాలు కల్పిస్తున్నారు. కాంట్రాక్టు కార్మికులకు గేట్ల వద్ద మాత్రమే బయోమెట్రిక్ అమలు చేస్తుండడంతో వారు అక్కడ బయోమెట్రిక్ వేస్తేనే ప్లాంట్‌లోకి అనుమతిస్తున్నారు. ఉద్యోగులు మాత్రం తమ విభాగాల్లో బయోమెట్రిక్ వేయవచ్చు.

సినిమా గైడ్

- **పారిజాత పర్వం :** సంగం, శ్రీనరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), దుర్గ (మధురవాడ)
- **టెనెంట్ :** శారద, విశేష్ (గోపాలపట్నం), తాతా (తగరపువలస)
- **గీతాంజలి మళ్ళీ వచ్చింది :** మెలోడి, గోకుల్, శ్రీకన్య, రమాదేవి, ఊర్వశి (కంచరపాలెం) మౌర్య (గోపాలపట్నం), హెవెన్-3 (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి),
- **ది ఫ్యామిలీ స్టార్ :** కామేశ్వరి, నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), శ్రీకన్య (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **టిల్లు స్క్వేర్ :** జగదాంబ, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శ్రీవెంకటేశ్వర, కిన్నెర, లక్ష్మీకాంత్ (గాజువాక)
- **మంజుమ్మెల్ బోయ్స్ :** శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **మార్కెట్ మహాలక్ష్మి :** శ్రీలీలామహల్, సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 22, టమాటా 22, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 28, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 40, బీరకాయలు 46, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 26, క్యాబేజీ 24, క్యారెట్ 26, దొండకాయలు 26, బంగాళా దుంపలు 25, అరటికాయ (పెద్దది)6, అల్లం (పాతది) 150, మునక్కాడలు (కిలో) 28, బరబాటి 32, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 90, గోరుచిక్కుడు 32, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 110, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 46, ఆగాకర 74, పొటల్స్ 68, కీర దోస 24, క్యాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 44, చిలగడదుంపలు 30, కంద 60, దేముడుచిక్కుడు 50, కొండఉసిరి 90, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	430
విజయనగరం	434
శ్రీకాకుళం	434

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	110
ఫారం ధర	--	130
విత్ స్కిన్	--	230
స్కిన్‌లెస్	--	240

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఆడారి ఆనంద్‌కుమార్



58వ వార్డు ప్రచారంలో మహిళకు నమస్కారం చేస్తున్న ఆనంద్‌కుమార్

గెలుపు కోసం సైనికుల్లా పని చేయండి

నాయకులు, కార్యకర్తలకు వైసీపీ 'పశ్చిమ' అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ విజ్ఞప్తి

మల్కాపురం, ఏప్రిల్ 18: వైసీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థిగా శుక్రవారం నామినేషన్ వేస్తున్నానని, తన గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సైనికుల్లా పనిచేయవలసిందిగా ఆడారి ఆనంద్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. కొత్తనక్కవానిపాలెంలోని వైసీపీ కార్యాలయంలో 60వ వార్డు నాయకులు, కార్యకర్తలతో గురువారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కృషి చేసిన వారందరికీ మంచి గుర్తింపు ఉంటుందని, వారికి మంచి భవిష్యత్తు ఉండాలే తాను చూస్తానన్నారు. ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే జీవితాంతం మీతో కలిసి ఉంటానన్నారు. రాజ్యాంగబద్ధంగా పదవి లేకున్నా వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్తగా ప్రజలకు ఎన్నో సేవలందించానని, ఎమ్మెల్యేగా గెలిపిస్తే మరింతగా సేవలు అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి వైసీపీ గెలుపు కోసం కృషి చేయాలని ఆనంద్‌కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పీవీ సురేశ్, వైసీపీ నియోజకవర్గ పరిశీలకురాలు పీలా ఉమారాణి, వార్డు అధ్యక్షుడు ఆడారి హరీశ్, వార్డు ఇన్‌చార్జి జీవీఎల్ నరేశ్, నాయకులు పిల్లా కనకరాజు, అంగ రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

58వ వార్డులో పర్యటన

ఇదిలా ఉండగా ఆడారి ఆనంద్‌కుమార్ ఉదయం 58వ వార్డులో పర్యటించి తనను పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిపించవలసిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వైసీపీ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిందని విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేసిందన్నారు. తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గులిగిందల లావణ్య, బూత్ కన్వీనర్ గొండేశి పెద్ద సత్యనారాయణ రెడ్డి, వైసీపీ నాయకుడు గులిగిందల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం టీడీపీతోనే సాధ్యం

వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడాలి

పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, అభ్యర్థి పి.గణబాబు



89వ వార్డులో ఎన్నికల ప్రచారం చేస్తున్న గణబాబు, తదితరులు

గోపాలపట్నం, ఏప్రిల్ 18: రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని ఆ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, అభ్యర్థి పి.గణబాబు అన్నారు. 89వ వార్డు పరిధి సంతోశ్‌నగర్‌లో గురువారం సాయంత్రం ఆయన ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించి రాష్ట్రాభివృద్ధికి ప్రజలంతా దోహదపడాలని ఆయన కోరారు. ఇంటింటికీ వెళ్లి మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలు ప్రజలకు ఏ విధంగా మేలు చేస్తాయో తెలియజేయడంతో పాటు వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. వైసీపీ విధ్వంస పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని, ప్రభుత్వ అరాచక పాలనకు చరమగీతం పాడాలన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు తీస్తుందని, యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. అందువల్ల ఎమ్మెల్యేగా తనను, విశాఖ ఎంపీగా శ్రీభరత్‌ను గెలిపించవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దాడి వెంకట రమేశ్, వార్డు అధ్యక్షుడు బొడ్డేటి విజయ్‌కుమార్, అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



88వ వార్డులో ప్రచారంలో పాల్గొన్న పల్లా శ్రీనివాసరావు, తదితరులు

రాష్ట్రం బాగు కోసం చంద్రబాబును మళ్లీ సీఎం చేయాలి

టీడీపీ గాజువాక అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 18: రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే చంద్రబాబు వంటి దూరదృష్టి గల నాయకుడు మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని టీడీపీ గాజువాక నియోజకవర్గ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు అన్నారు. 88వ వార్డు యాదవజగ్గరాజుపేట, కాపుజగ్గరాజుపేట, ఎస్టీబీఎల్‌లలో గురువారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే దశాబ్దాల కాలంగా ఉన్న ఏపీఐఐసీ సమస్యను పరిష్కరిస్తానన్నారు. వైసీపీ మాయమాటలు నమ్మి మరోసారి మోసపోవద్దని ప్రజలను కోరారు. సూపర్ సిక్స్ పథకాల గురించి ఓటర్లకు చెప్పడంతో పాటు జగన్ పాలనా వైఫల్యాలను వివరించారు. రాష్ట్రం ప్రగతి బాటలో నడవాలన్నా, యువతకు ఉద్యోగాలు రావాలన్నా, పేదలు, బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు అందాలన్నా చంద్రబాబు మళ్లీ సీఎం కావాలన్నారు. జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావు మాట్లాడుతూ ఎమ్మెల్యేగా పల్లాను, ఎంపీగా శ్రీభరత్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు గొలగాని సన్యాసిరావు, యు.శ్రీనివాసరావు, జి.సత్తిబాబు, శివకుమార్, పైడిరాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: టీడీపీ గాజువాక అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు 69వ వార్డులో ప్రచారం చేపట్టారు. ముందుగా శ్రీలానగర్ అయ్యప్పస్వామి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం ఆయన హరిజన జగ్గయ్యపాలెం, వెంకటేశ్వరకాలనీ, శ్రీలానగర్, మాజీ సైనికుల కాలనీల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ఐదేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవ్వడంతో ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. నాయకులు అలమండ రాజు, ఎస్.రాజేశ్, ఎ.శ్రీను, నిర్మలాకుమారి, మధులత, తిప్పల రమణారెడ్డి, ఎస్.భాస్కర్, జి.గోపి. తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

పెందుర్తి, ఏప్రిల్ 18: సుజాతనగర్ సబ్ స్టేషన్ పరిధి పాపయ్యరాజుపాలెం 11కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా పోలీస్ స్టేషన్, సీహెచ్‌సీ, శాంతినగర్, చినముషిడివాడ మెయిన్ రోడ్డు, ఇంద్రాణి ఫంక్షన్ హాల్, శివగాయత్రినగర్, మాస్టర్ ఈకె ఏరియా, సుజాతనర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

అక్కిరెడ్డిపాలెం ఫీడర్ పరిధిలో..

అదేవిధంగా పెందుర్తి సబ్ స్టేషన్ పరిధి అక్కిరెడ్డిపాలెం 11కేవీ ఫీడర్‌లో మరమ్మతు పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు అక్కిరెడ్డిపాలెం, బందవానిపాలెం, జుత్తాడ, వాలిమెరక, వరలక్ష్మీనగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ పేర్కొన్నారు.

నరసింహనగర్, ఇందిరానగర్, చంద్రనగర్ పరిధిలో..

గోపాలపట్నం: ఇక్కడి నరసింహనగర్, ఇందిరానగర్, చంద్రనగర్ ఫీడర్ల పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా గోపాలపట్నం బంక్ ఏరియా, మెయిన్ రోడ్డు, ఇందిరానగర్, నరసింహనగర్, గణేశ్‌నగర్, లక్ష్మీనగర్, సునర్ల కాలనీ, లక్ష్మీనగర్ ఎఫ్-బ్లాక్, ఏపీఎస్ఈబీ కాలనీ, సీతారామరాజు నగర్, ఆదర్శనగర్, చంద్రనగర్, సంతోశ్‌నగర్, ఎల్లపువానిపాలెం ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

గోల్ఫ్ విజేత అదిత్‌కు సత్కారం



అంతర్జాతీయ గోల్ఫ్ క్రీడాకారుడు అదిత్‌ను సత్కరించిన దృశ్యం

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 18: జీవీఎంసీ 88వ వార్డు పరిధి వైజాగ్ ప్రొఫైల్స్ గ్రీన్‌సిటీ వాసి, అంతర్జాతీయ గోల్ఫ్ క్రీడాకారుడు వీరమాచనేని అదిత్‌ను గురువారం ఘనంగా సత్కరించారు. ఇటీవల జరిగిన అంతర్జాతీయ స్థాయి గోల్ఫ్‌లో అండర్-12 విభాగంలో అదిత్ మంచి ప్రతిభ కనపరిచాడు. స్కాట్లాండ్, యూరప్, అమెరికా, తదితర దేశాల్లో భారత్ తరపున ఆడి బంగారు పతకాలు సాధించి విశాఖ విచ్చేసిన సందర్భంగా అదిత్‌కు వైజాగ్ ప్రొఫైల్స్ డైరెక్టర్ వీవీ కృష్ణారావు, కుటుంబ సభ్యులు, మిత్రులు, ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని పోటీల్లో రాణించి భారత్‌కు మంచిపేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

శ్రీనగర్‌లో కుట్టుమిషన్లు పంపిణీ

శ్రీనగర్, ఏప్రిల్ 18: జీవీఎంసీ 71వ వార్డు పరిధి శ్రీనగర్‌లో సీఎల్‌సీ సంస్థ చైర్మన్ బిషప్ సుధీర్ మహంతి ఆధ్వర్యంలో గురువారం సుమారు 50 మంది పేద మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బిషప్ మహంతి మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా పేదలు, నిరాశ్రయుల కోసం పలు సేవా కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు మెర్సీ మహంతి, ఆల్‌ఫ్రెడ్ మహంతి, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న తిరుమల నగర్ కాలనీ ప్రతినిధులు

నీటి వినియోగం, పరిరక్షణపై అవగాహన ర్యాలీ

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 18: అందరికీ నీరే ప్రాణాధారమని, అందువల్ల అందరూ నీటిని సంరక్షించాలంటూ గురువారం 87వ వార్డు తిరుమలనగర్ కాలనీ ప్రతినిధులు నీటి వినియోగం, పరిరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కాలనీలోని ప్రజలందరూ నీటిని దుర్వినియోగం చేయరాదని, ప్రతి ఇంటి వద్ద ఇంకుడుగుంతలను తప్పకుండా తవ్వించాలని, అందరూ విధిగా మొక్కలు నాటాలని బ్యానర్లు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు నాగభూషణం, విశ్వేశ్వరరావు, వాటర్ హీరో అవార్డు గ్రహీత పరమానందం, పరమేశ్వరరావు, సన్యాసిరావు, వసంతరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మను దర్శించుకున్న 'బండారు'

వేపగుంట, ఏప్రిల్ 18: ఇక్కడి ముత్యాలమ్మ అమ్మవారిని గురువారం తెలుగుదేశం పార్టీ మాడుగుల అభ్యర్థి బండారు సత్యనారాయణమూర్తి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు టీడీపీ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం మాడుగులలో ప్రచారం నిర్వహించేందుకు ఆయన బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శెట్టి అప్పారావు, గంట్ల దేముడు, దివాకర్, కృష్ణ, నానాజీ, ముత్తానాయుడు, తదితరులు పాల్గొన్నారు.



జలాభిషేకంలో బొర్రమాంబ.. పక్కన అమ్మవారి దర్శనానికి తరలివచ్చిన భక్తులు

వైభవంగా బొర్రమాంబ పుట్టబంగారం ఉత్సవం

అగనంపూడి, ఏప్రిల్ 18: అగనంపూడి, ఉక్కు నిర్వాసిత గ్రామాల ఆరాధ్య దైవం బొర్రమాంబ అమ్మవారి పుట్టబంగారం ఉత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము మూడు గంటల నుంచే అమ్మవారిని దర్శించి, జలాభిషేకం చేసేందుకు వందలాది మంది భక్తులు తరలివచ్చారు. సాయంత్రం వరకు బొర్రమాంబకు అభిషేకాలు జరగడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది జలాభిషేకానికి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు వాటర్ ట్యాంకులను అందుబాటులో ఉంచారు. సాయంత్రం అమ్మవారిని మేళతాళాలు, బాణసంచా కాల్పుల నడుమ పాతఅగనంపూడిలో గ్రామ ప్రవేశం చేయించారు. బండ్ల వేషాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కాగా ఈ నెల 22న అమ్మవారి తొలేళ్లు, 23న బొర్రమాంబ అనుపోత్సవాన్ని నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ చైర్మన్ చిత్తా గణేశ్ తెలిపారు.

ఘనంగా ముత్యమాంబ ప్రధాన పండుగ

ఆర్పీపేట (కంచరపాలెం), ఏప్రిల్ 18: గవర కంచరపాలెం గ్రామ దేవత ముత్యమాంబ అమ్మవారి ప్రధాన పండుగను గురువారం ఘనంగా నిర్వహించారు. కంచరపాలెం మెట్టు వద్దనున్న అమ్మవారి ప్రధాన ఆలయంలో గురువారం వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. పశ్చిమ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి గణబాబు దంపతులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ నెల 25న ముత్యమాంబ అమ్మవారి మారువారం పండుగను నిర్వహిస్తామని గ్రామ సంఘం ప్రతినిధులు దాడి సూరి అప్పారావు, బీశెట్టి శ్రీనివాసరావు, మళ్ల శంకరరావు తెలిపారు.



గంగవరం పోర్టు మెయిన్ గేటు వద్ద మోహరించిన పోలీసులు

భద్రతా వలయంలో గంగవరం పోర్టు

పెదగంట్యాడ, ఏప్రిల్ 18: అదానీ గంగవరం పోర్టు భద్రతా వలయంలో ఉంది. పోర్టు కార్మికుల ఆందోళనల నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తుగా పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో పోర్టు మెయిన్ గేటు వద్ద గురువారం అధిక సంఖ్యలో పోలీసులు మోహరించారు. న్యూపోర్టు, గాజువాక, మల్కాపురం, హార్బర్ స్టేషన్లకు చెందిన పోలీసులు ఇక్కడ ఉన్నారు. తమకు కనీస వేతనంగా రూ.36 వేలు చెల్లించడంతో పాటు చట్టబద్ధంగా అన్ని అలెవెన్సులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గంగవరం పోర్టు కార్మికులు ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో వారం రోజులుగా ఆందోళనలు చేస్తున్న సంగతి తెలిసిందే. యాజమాన్యం స్పందించకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని కార్మికులు హెచ్చరించడంతో పోలీసులు అప్రమత్తమై పెద్దఎత్తున మోహరించారు.

గాజువాకలో రెండు నామినేషన్లు

గాజువాక, ఏప్రిల్ 18: గాజువాక నియోజకవర్గంలో తొలిరోజైన గురువారం రెండు నామినేషన్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి.లక్ష్మారెడ్డి స్వీకరించారు. జాతీయ జనసేన పార్టీ అభ్యర్థి పల్లి శ్రీనివాసరావు, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తరపున పి.సత్యనారాయణమూర్తి నామినేషన్లు దాఖలు చేశారు. కాగా రిటర్నింగ్ కార్యాలయం వద్ద ఎటువంటి ఇబ్బందులు లేకుండా పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా అన్ని రాజకీయ పార్టీల నాయకులు పాటించాలని లక్ష్మారెడ్డి సూచించారు.

పెందుర్తిలో ఒకటి..

పెందుర్తి: ఇక్కడి తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయంలో ఈఆర్వో శేషశైలజ బీఎస్పీకి చెందిన బంగారి రమణ నుంచి నామినేషన్ పత్రాలను స్వీకరించారు. కాగా ఈఆర్వో కార్యాలయం వద్ద పోలీసులు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు. నామినేషన్ల స్వీకరణ నేపథ్యంలో ఈఆర్వో కార్యాలయం నుంచి వంద మీటర్ల వరకు నిషేధిత ప్రాంతంగా ప్రకటిస్తూ బారికేడ్లు నిర్మించారు. 144 సెక్షన్ కూడా అమలులో ఉంది. కాగా ఈ మార్గం వెళ్లే నివాసితుల కోసం అధికారులు ప్రత్యామ్నాయ మార్గం చూపారు.

24న పల్లా శ్రీనివాసరావు నామినేషన్

గాజువాక, ఏప్రిల్ 18: తెలుగుదేశం పార్టీ గాజువాక అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు ఈ నెల 24న నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు ఇక్కడి వందడుగుల రోడ్డులో గల ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలను అందజేస్తారు. ముందుగా పాత గాజువాకలోని కుంచుమాంబ ఆలయంలో పూజలు చేస్తారు. అనంతరం అక్కడ నుంచి కొత్త గాజువాక వెళ్లి ప్రధాన రహదారి గుండా సినిమాహాల్ జంక్షన్, పాత గాజువాక, చినగంట్యాడ కూడళ్ల మీదుగా ఈఆర్వో కార్యాయానికి ఆయన చేరుకుంటారు.

రెండు నాగజెర్రి పాములు పట్టివేత



పాములతో స్నేక్ క్యాచర్ నాగరాజు

మల్కాపురం/సింధియా, ఏప్రిల్ 18: నేవీ క్వార్టర్స్ పరిసరాల్లో ఓ ఇంటి ముందు బుధవారం రాత్రి సంచరిస్తున్న రెండు పాములను స్నేక్ క్యాచర్ నాగరాజు ఎంతో చాకచక్యంగా పట్టుకున్నాడు. ఓ ఇంటి ముందు రెండు పాములు తిరుగున్నట్టు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్న వ్యక్తులు నాగరాజుకు ఫోన్‌లో సమాచారం అందించారు. ఈ మేరకు ఆయన అక్కడకు చేరుకుని పాములను పట్టుకోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. సుమారు ఆరేసి అడుగులు ఉన్న ఇవి నాగజెర్రి పాములని నాగరాజు తెలిపాడు. వీటిని కొండ ప్రాంతంలో విడిచిపెడతానన్నాడు. ఇళ్ల పరిసరాల్లో పాములు సంచరిస్తున్నట్టయితే 7569135128 నంబర్‌కు ఫోన్ చేస్తే తాను వాటిని పట్టుకుంటానని పేర్కొన్నాడు.

'స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కృషి'

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 18: ప్రస్తుతం స్టీల్‌ప్లాంట్ అత్యంత క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటుందని, దీని నుంచి బయటపడేందుకు యాజమాన్యం తగిన చర్యలు చేపట్టాలని టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి కోగంటి లెనిన్‌బాబు కోరారు. ప్లాంట్‌లో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అదానీ గంగవరం పోర్టు కార్మికుల సమ్మె ప్రభావం స్టీల్‌ప్లాంట్‌పై పడిందన్నారు. అధికారులు ముందుచూపుగా వ్యవహరించి ఉంటే ప్లాంట్‌కు ఈ దుస్థితి వచ్చేది కాదన్నారు. ఎంతోమంది ప్రాణత్యాగాల ఫలితంగా ఏర్పడిన స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకునేందుకు ఎంతటి పోరాటాలకైనా తాము సిద్ధమన్నారు. ఈ సమావేశంలో నాయకులు నమ్మి సింహాద్రి, చీపురుపల్లి శ్రీనివాస్, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

దాసరి పైడిమాంబ పండుగ వాల్ పోస్టర్లు ఆవిష్కరణ



వాల్ పోస్టర్లు ఆవిష్కరించిన ఆలయ కమిటీ సభ్యులు

అక్కిరెడ్డిపాలెం, ఏప్రిల్ 18: అక్కిరెడ్డిపాలెం పరిసర ప్రాంతాల ప్రజల ఆరాధ్య దేవత దాసరి పైడిమాంబ అమ్మవారి పండుగకు సంబంధించిన వాల్ పోస్టర్లను గురువారం ఆలయ కమిటీ సభ్యులు గుడివాడ లతీశ్, తదితరులు ఆవిష్కరించారు. దాసరి మెట్ట వద్దనున్న ఆలయ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మాట్లాడుతు ఈ నెల 23న అమ్మవారి పండుగను ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఆ రోజు ఉదయం నుంచి ప్రత్యేక పూజలతో పాటు మధ్యాహ్నం అన్న సమారాధన చేపడతామని, సాయంత్రం 1,008 కలశాలతో శోభాయాత్ర చేపడతామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కె.సత్యారావు, వి.రమణ, బి.గోవిందరావు, సర్వసిద్ధి అనంతలక్ష్మి, ఎం.శాలిని, తదితరులు పాల్గొన్నారు.

దుర్గమాంబ జాతరకు తరలివచ్చిన భక్తులు



పూజలందుకున్న దుర్గమాంబ

అగనంపూడి, ఏప్రిల్ 18: జీవీఎంసీ 85వ వార్డు పరిధి ఫార్మాసిటీ పునరావాస కాలనీ కొత్తపాలెం ప్రజల ఇలవేల్పు దుర్గమాంబ జాతరను గురువారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము ఐదు గంటల నుంచే అమ్మవారి దర్శనాలు ప్రారంభం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దుర్గమాంబకు పసుపు, కుంకుమలు, మొక్కుబడులు చెల్లించారు. ఆలయ కమిటీ, యువజన సంఘాల ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను పురవీధుల్లో ఊరేగించి ఆలయం తీసుకువచ్చి ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బాణసంచా కాల్పులు, సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు గొల్లవిల్లి సన్యాసిరావు, నాగరాజు, నీలకంఠం, చిన్నారావు, ఈశ్వరరావు, శంకరరావు, గోపి, తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపు

డాబాగార్డెన్స్: చిల్డ్రన్స్ సమ్మర్ క్యాంప్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.అనంతరం ఆసరా చారిటబుల్ సొసైటీ , గౌతు లచ్చన్న ఆర్గనైజేషన్ ఫర్ వీకర్ సెక్షన్స్ సంస్థలు బుక్స్, స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ చేశాయి. ఈ క్యాంప్ ఈనెల 25నుంచి మే 10వరకు ఉంటుందనినిర్వాహకులుసునీత, వెంకటగిరి తెలిపారు.




జనసేన పార్టీలో చేరిన వారితో దక్షిణ నియోజకవర్గ కూటమి అభ్యర్థి వంశీకృష్ణ



మహారాణిపేటలో సందీప్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు

కూటమి అభ్యర్థుల గెలుపుతోనే అభివృద్ధి సాధ్యం

- 'దక్షిణ' జనసేన అభ్యర్థి వంశీకృష్ణ
- జనసేనలో భారీగా వైసీపీ శ్రేణులు చేరిక

పూర్ణామార్కెట్, ఏప్రిల్ 18: దక్షిణంలో కూటమి అభ్యర్థులను గెలిపించి అభివృద్ధికి దోహదపడాలని జనసేన అభ్యర్థి వంశీకృష్ణ కోరారు. గురువారం గ్రేటర్ 31వ వార్డు ఎల్లమ్మతోటలో వైసీపీకి చెందిన కనకవల్లి, సూర్యాదేవి, ఉషమ్మ, మంగ, విజయలక్ష్మి, సూర్యాదేవి, గురుతల్లి, నీలిమ, పల్లాచిట్టెమ్మ లక్ష్మి, జయశ్రీ, అశ్విని, గౌరి, రూప, గోపి, సాయి తదితర 50 కుటుంబాలు వంశీకృష్ణ సమక్షంలో జనసేనలో చేరారు. అలాగే, 35వ వార్డు చిన దుర్గాలమ్మగుడి, పండావీధికి చెందిన యువకులు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. బ్యారెక్స్ వద్ద ఫుట్‌పాత్ వ్యాపార సంఘాల ప్రతినిధులు కాకరరాజు, వంక శ్రీను. బి. రాంబాబు, వినోద్, చంద్రశేఖర్, ఖాన్ అహ్మద్, నాని, ఎం.భాస్కర్ బుజ్జి, ప్రసాద్, హేమంత్‌కుమార్, ప్రసాద్, రామస్వామి తదితర 100 మంది జనసేనలో చేరారు. ఆపార్టీ అధ్యక్షుడు లెంక త్రినాధ్, రఘ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికీ వంశీకృష్ణ కండువాలు వేసి స్వాగతంపలికారు. రానున్న ఎన్నికల్లో ఇదే ఉత్సాహంతో పనిచేసి ఎంపీ అభ్యర్థి శ్రీభరత్‌కు సైకిల్‌గుర్తుపై, జనసేన గాజు గుర్తు గ్లాస్‌కుఓటేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పిల్లి రమణ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, యువకులు పాల్గొన్నారు.

జగదాంబ కూడలి/ మహారాణిపేట ఏప్రిల్ 18: దక్షిణ నియోజకవర్గ కూటమి అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ ఎన్నికల్లో గెలిపించాలని ఆయన తనయుడు సందీప్ ప్రజలను అభ్యర్థించారు. గురువారం ఆయన 29వ వార్డు సూర్యాహాస్పిటల్, బీచ్ రోడ్డుతో పలు ప్రాంతాల్లో పర్యటించి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గంలో అభివృద్ధికి, ప్రజల ఆకాం క్షలకు అనుగుణంగా సేవలందిస్తారన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. జనసేన, టీడీపీ, బీజేపీ వార్డు స్థాయి నాయకులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

కేజీహెచ్ రోగుల సహాయకులకు ఉచిత భోజనాలు



భోజన పథకం ప్రారంభిస్తున్న నిర్వాహకులు, వైద్యాధికారులు

మహారాణిపేట, ఏప్రిల్ 18: కేజీహెచ్‌లో రోగులకు సహాయంగా వచ్చే వారికి ఇకపై ఏడాది పాటు ఉచితంగా భోజనాలు అందించనున్నట్టు హరేకృష్ణా మూవ్‌మెంట్ అధ్యక్షుడు ఎస్. భక్తదాస తెలిపారు. హరేకృష్ణా మూవ్‌మెంట్ అండ్ టచ్‌స్టోన్ సంస్థ ఆధ్వర్యంలో సుభోజనం పేరుతో గత 12 సం వత్స రాలుగా రోగుల సహాయకులు, వారి బంధువులకు నామమాత్ర ధరకే మూ డు పూటలా భోజనం అందిస్తోంది. ఈ కార్యక్రమం ప్రాముఖ్యతను తెలు సు కున్న ఇండో ఎమ్‌ఐఎం ప్రైవేట్ సంస్థ ఒక ఏడాదిపాటు ఉచితంగా భోజనం అందించేందుకు విరాళం అందించింది. ఈ సందర్భంగా గురువారం ఇండో ఎ మ్‌ఐఎం సంస్థ సీఈవో విజయ్‌కుమార్ ఈ భోజన వితరణ కార్యక్ర మాన్ని ప్రారంభించారు. రోజూ మధ్యాహ్నం 400 మందికి ఉచితంగా భోజనం అందించనున్నారు. అలాగే, ఉద యం అల్పాహారం, రాత్రి భోజనం సైతం వడ్డించనున్నారు. ఈ కార్యక్రమంలో డీఎం ఈ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు, సూపరిం టెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గంగవరం పోర్టు కార్మికుల సమస్య పరిష్కరించాలి : సీపీఐ



మాట్లాడుతున్న సీపీఐ నేత సత్యనారాయణ మూర్తి

అల్లిపురం, ఏప్రిల్ 18: గంగవరం పోర్టు కార్మికుల సమస్యలను తక్షణమే యాజమాన్యం పరిష్కరిం చాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి డిమాండ్ చేశారు. గురువారం అల్లిపురంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వారం రోజులుగా పనికి తగిన సమాన వేతనం కోసం కార్మికులంతా పో రాటం చేస్తున్నా యాజమాన్యం పట్టించుకోకుండా వ్యవహరిస్తోందన్నారు. య జమాన్యం శ్రమదోపిడీతో లాభాలు ఆర్జిస్తున్నా కార్మికులకు రూ. 15వేల లోపు మాత్రమే వేతనాలు ఇస్తూ అన్యాయం చేస్తోందన్నారు. పోర్టు కార్మికులకు ఇ చ్చినట్టే గంగవరం పోర్టు కార్మికులకూ కనీస వేతనం రూ. 36వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

తొలిరోజు రెండు నామినేషన్లు దాఖలు



తహసీల్దార్ కార్యాలయం ఎదుట పోలీసుల బందోబస్తు

సీతమ్మధార, ఏప్రిల్ 18: సార్వత్రిక ఎన్నికలకు ఉత్తర నియోజకవర్గానికి సంబంధించి స్థానిక అర్బన్ తహసీల్దార్ కార్యాలయాన్ని సిద్ధం చేశారు. రిటర్నింగ్ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి.అఖిల, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ జి.శ్రీరామమూర్తి సిబ్బందితో సహా అభ్యర్థులనుంచి నామినేషన్ల పత్రాలను గురువారం స్వీకరించారు. తొలిరోజు భారత నిర్మాణ సేవా పార్టీ నుంచి చింతాడ సూర్యం, జాతీయ జనసేన పార్టీ నుంచి పి.జగదీష్ వీరిద్దరు నామినేషన్ పత్రాలను సమర్పించారు. కార్యాలయ ఆవరణలో ద్వారకా పోలీసు స్టేషన్ సీఐ ఎస్.రమేశ్, ఎస్ఐ ధర్మేంద్ర సిబ్బంది ప్రత్యేక బందోబస్తు చేపట్టారు.

51వ వార్డులో జైభారత్ పార్టీ ప్రచారం



చిన్నారికి లెక్కలు బోధిస్తున్న అభ్యర్థి లక్ష్మీనారాయణ

మురళీనగర్, ఏప్రిల్ 18; 51వవార్డు మాధవధార గాంధీనగర్‌లో గురువారం జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షులు, ఉత్తరం అభ్యర్థి వి.వి. లక్ష్మీనారాయణ ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా చిట్టిబాబు కాలనీలోని ఓ ఇంట్లో పదో తరగతి చదువున్న విద్యార్థినితో మాటామంతీ కలిపారు.చదువు సాగుతున్న తీరుపై అడిగితెలుసుకున్నారు. ఆ చిన్నారికి పదో తరగతి లెక్కల సబ్జెక్టులో వచ్చిన సందేహాన్ని నివృత్తి చేశారు. చదువుపై విద్యార్థులు పూర్తి శ్రద్ధ కనపరచాలని ఈసందర్భంగా లక్ష్మీనారాయణ విద్యార్థికి సూచించారు. ప్రచారంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి: ఆర్వో



మాట్లాడుతున్న ఆర్వో హుస్సేన్ సాహెబ్

జ్ఞానాపురం, ఏప్రిల్ 18: ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని పశ్చిమ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో డి.హుస్సేన్ సాహెబ్ అన్నారు. గురువారం స్థానిక పశ్చిమ నియోజకవర్గం ఆర్వో కార్యాలయం సమావేశ మందిరంలో ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, ఎంసీసీ, వీఎస్‌టీ టీమ్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ బృందాలు ఎటువంటి ఒత్తిళ్లకు లొంగకుండా పనిచేయాలని సూచించారు. వచ్చిన ఫిర్యాదులపై త్వరతగతిన స్పందించాలన్నారు. అన్ని ప్రదేశాల్లో రాత్రి వేళల్లో గస్తీ నిర్వహిస్తూ ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూసుకోవాలని ఆదేశాంచారు.

వైభవంగా సీతారాముల పట్టాభిషేకం



పూజలు చేస్తున్న భక్తులు

సీతమ్మధార, ఏప్రిల్ 18 : సీతంపేటలోని పార్వతీశ్వరాలయంలో శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా గురువారం సీతారాముల పట్టాభిషేకాన్ని నిర్వహించారు. సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడుశ్రీనివాసరావు దంపతులున్నారు.

ఇంటర్ సర్వీసెస్ వాటర్‌పోలో చాంపియన్ నేవీ



చాంపియన్ షిప్ సాధించిన ఇండియన్ నేవీ జట్టు సభ్యులు

విశాఖపట్నం, ఏప్రిల్ 18: ఇంటర్ సర్వీసెస్ వాటర్‌పోలో చాంపియన్ షిప్ పోటీలు గురువారం డాల్ఫిన్‌హిల్స్ స్విమ్మింగ్ పూల్‌లో జరిగాయి. ఈ పోటీలో ఇండియన్ నేవీ జట్టు విజేతగా నిలిచింది. పోటీల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సబ్‌మెరైన్స్ ఫ్లాగ్ ఆఫీసర్ రియర్ అడ్మిరల్ కె.వెంకట్రామన్ ముఖ్యఅతిథిగా హాజరై విజేత జట్టుకు ట్రోఫీని అందజేశారు.

కనకమహాలక్ష్మికి పంచామృతాభిషేకాలు



జగదాంబ కూడలి, ఏప్రిల్ 18: వన్‌టౌన్ బురుజుపేటలోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో త్రికాల పంచామృతాభిషేక సేవలను గురువారం ఉభయ దాతలతో అర్చ కులు జరిపించారు. 10మంది ఉభయదాతలు ఈ పూజల్లో పాల్గొన్నారు. పూజల అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం అమ్మవారికి కుంకుమపూజలుజరిపి, ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈవో శ్రీనివాసుల రెడ్డి తెలిపారు.

లారీ ఢీకొని మహిళ మృతి

- కుమారుడికి గాయాలు
- ప్రమాదం నుంచి బయట పడిన భర్త, కుమార్తె



ప్రమాదంలో మృతి చెందిన శివేశ్వరి

లంకెలపాలెం, ఏప్రిల్ 18: పిల్లలతో కలిసి ద్విచక్ర వాహనంపై వెళుతున్న భార్యాభర్తలకు గుర్తు తెలియని లారీ ఢీకొంది. ఘటనలో భార్య అక్కడిక్కడే ప్రాణాలు విడిచింది. కుమారుడికి గాయాలు కాగా భర్త, కుమార్తె ప్రమాదం నుంచి బయట పడ్డారు. లంకెలపాలెం వద్ద గురువారం రాత్రి ఈ ప్రమాదం చోటు చేసుకున్న ఈ ఘటనపై పరవాడ పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. ఫార్మాసిటీలోని లారస్ ల్యాబ్స్‌లో పనిచేస్తున్న తలశిల అనీల్‌కుమార్, పెదముషిడివాడలో కుటుంబ సభ్యులతో నివాసముంటున్నాడు. భార్య శివేశ్వరి (34) కుమారుడు నిఖిల్ (8) కుమార్తె జశ్విక నలుగురు కలిసి బైక్‌పై అగనంపూడి పండగ కోసం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వస్తుండగా లంకెలపాలెం పెట్రోల్ బంకు సమీపంలోకి వచ్చేసరికి వెనుక నుంచి గుర్తు తెలియని లారీ వేగంగా వచ్చి ఢీకొంది. ఈప్రమాదంలో భార్య శివేశ్వరి వెనక్కి పడడంతో లారీ చక్రాలు ఆమె తలపై నుంచి వెళ్లి సంఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచారు. కుమారుడు నిఖిల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. భర్త అనిల్‌కుమార్, కుమార్తె జశ్విక ప్రమాదం నుంచి బయటపడ్డారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు



విద్యార్థులతో ఈకార్వో ప్రతినిధులు

విశాఖపట్నం, ఏప్రిల్ 18: వార్షిక పరీక్షల్లో ప్రతిభ కనబరిచినరైల్వే ఉద్యోగుల పిల్లలకు తూర్పుకోస్తా రైల్వే మహిళా సంక్షేమ సంఘం వాల్తేరు శాఖ (ఈకా ర్వో) స్కాలర్‌షిప్‌లు అందజేసింది. గురువారం జరిగిన ఈ కార్యక్రమానికి ఈకార్వో అధ్యక్షురాలు మంజుశ్రీ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై టెన్త్, ఇంటర్మీడియట్, మెడికల్, ఇంజనీరింగ్, ఐఐటీ వంటి వివిధ పోటీ పరీక్షలలో ప్రతిభ చూపిన 40 మందికి స్కాలర్‌షిప్‌లు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా మరింత రాణించాలని ఆకాంక్షించారు. తమ సహకారం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈకార్వో ప్రతినిధులు కమితా గుప్తా, మధుస్మిత సాహుపాల్గొన్నారు.

'చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి'

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 18: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతుందని జీవీఎంసీ 31వ వార్డు ఆపార్టీ నాయకులు బత్తిన నవీన్‌కుమార్ అన్నారు. గురువారం వార్డులో దక్షిణ నియోజకవర్గ కూటమి అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్‌యాదవ్, ఎంపీ అభ్యర్థి శ్రీభరత్‌కు మద్దతుగా ఆర్‌టీక్లబ్, గొల్లలపాలెం ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం చేపట్టారు.ఈ కార్యక్రమంలో ఆర్‌జీ రాజేష్ నక్కావేణు, మణికంఠ, జితేందర్, పెదిరెడ్ల అప్పలరాజు, ఆర్‌జీ శంకరరావు, పూడి రమేష్, కృష్ణ, వరలక్ష్మి, సరస్వతి, టీడీపీ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం



లాలం సతీష్, మాధవ్‌కుమార్ (ఫైల్)

పెద్దాపురం, ఏప్రిల్ 18: పెద్దాపురం- రాజమహేంద్రవరం ఏడీబీ రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందగా మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనకాపల్లికి చెందిన లాలం సతీష్ (20), విశాఖపట్టణానికి చెందిన బర్రి మాధవ్‌కుమార్ (19), శ్రీకాకుళం జిల్లా చిగురువలసకు చెందిన రామచంద్రరావు కాకినాడ జిల్లా పెద్దాపురం వచ్చారు. మోటార్ సైకిల్‌పై రూముకు వెళుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో మాధవ్, సతీష్ అక్కడికక్కడే మృతిచెందగా రామచంద్రరావు తీవ్రంగా గాయపడ్డాడు. బైక్‌ను ఢీకొట్టిన వాహనం ఆగకుండా వెళ్లిపోయింది. యువకులు రామేశంపేటలో గది అద్దెకు తీసుకుని ఇంజనీరింగ్ చదువుతున్నారు. క్షతగాత్రుడ్ని స్థానిక ఆస్పత్రికి, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించి ఎస్ఐ సురేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కేజీహెచ్‌లో అంకాలజీ ఐసీయూ ఏర్పాటు

మహారాణిపేట, ఏప్రిల్ 18: కేజీహెచ్ లో (మెడికల్ అంకాలజీ) కేన్సర్ రోగుల కోసం ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌ను గురువారం డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ డీవీఎస్ఎల్ నరసింహం ప్రారంభించారు. అంకాలజీ వి భాగంలో ప్రత్యేకంగా (ఎక్యూట్ లుకేమియా) బ్లడ్ కేన్సర్ రోగులకు ఈ ఐసీయూ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు, సూపరింటెండెంట్ అశోక్‌కుమార్, అంకాలజీ హెచ్‌వోడీ శిల్ప, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌లో టికెట్ల కేటాయింపుపై అసంతృప్తి'

మహారాణిపేట, ఏప్రిల్ 18: కాంగ్రెస్ పార్టీతో సంబంధం లేని వ్యక్తులకు ఈ సారి ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లు కేటాయించినట్టు కాంగ్రెస్ సెల్ విశాఖ జిల్లా చైర్మన్ కొణతాల శ్రీనివాస్ అన్నారు. గురువారం స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో అసెంబ్లీ, పార్లమెంట్ సంబంధించి టికెట్ల కేటాయింపుపై పార్టీ నాయకులు, కార్యకర్తలు పూర్తి అసంతృప్తితో ఉన్నారన్నారు. పార్టీ పూర్వ వైభవం కోసం కష్టపడుతున్న వారిని వదిలేసి ఏ ప్ర యోజనాన్ని ఆశించి ఇతరులకు టికెట్లు కేటాయించారని ఆయన ప్రశ్నించారు. ఈ విషయంలో ఏఐసీసీ పెద్దలకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

ఎన్నికల ముగిసే వరకు ఇంతేనా?

- బస్ బేపై సీఎం స్టిక్కర్



సౌత్‌ఎంటీసీ పాలెం బస్‌బేపై మెరిసిపోతున్న సీఎం స్టిక్కర్

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 18: నాలుగు లేన్ల రహదారికి ఆనుకుని ఉన్న పోర్టు హాస్పిటల్ సౌత్ ఎంటీసీ పాలెం బస్ బేలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఫొటోతో కూడిన స్టికర్ ధగధగా మెరిసిపోతోంది. ఎన్నికల కోడ్ అమలులోకివచ్చి నెలరోజులవుతున్నా ఈస్టిక్కర్‌ను మూ సి వేతపై అధికారులు సక్రమంగా చర్యలు తీసుకోలేదు. దీంతో సీఎం ఫొటో ఉన్న ప్రచార స్టికర్ స్పష్టంగాకనిపిస్తోంది. ఓటర్లను ప్రభావితం చేసే లా ఉన్న ఈ స్టిక్కర్‌ను అధికారులు స్పందించి కనిపించకుండా చేయాలని పలు పార్టీల నేతలు కోరుతున్నారు.

నామినేషన్ల సందడి



కలెక్టర్‌కు నామినేషన్ పత్రాలు అందిస్తున్న కేఏ పాల్

... 5వ పేజీ తరువాయి

వరకు (ఆదివారం తప్ప) ప్రతిరోజు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్టు అధికారులు తెలిపారు.

అసెంబ్లీ స్థానాలకు ఏడుగురు నామినేషన్లు...

తొలిరోజు జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలకుగాను భీమిలి, విశాఖ ఉత్తరం, గాజువాక, పెందుర్తి సెగ్మెంట్‌లకు ఏడుగురు నామినేషన్లు దాఖలు చేశారు. భీమిలి అసెంబ్లీకి తెలుగుదేశం తరపున గంటా శ్రీనివాసరావు, ఆయన కుమారుడు రవితేజ రెండేసి సెట్లు నామినేషన్లు భీమిలి ఆర్డీవో భాస్కరరెడ్డికు అందజేశారు. ఈ కార్యక్రమానికి టీడీపీతో పాటు జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరయ్యారు. ఇంకా విశాఖ ఉత్తరం నియోజక వర్గానికి నవభారత నిర్మాణ సేవ పార్టీ తరపున చింతాడ సూర్యం, జాతీయ జనసేన పార్టీ తరపున పి.జగదీష్‌లు సీతమ్మధార తహసీల్దారు కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి అఖిల వద్ద నామినేషన్లు సమర్పించారు. గాజువాక అసెంబ్లీకి జాతీయ జనసేన పార్టీ తరపున పల్లి శ్రీనివాసరావు, పిరమిడ్ పార్టీ తరపున పెబ్బలి సత్యనారాయణమూర్తిలు గాజువాక తహసీలార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి లక్ష్మారెడ్డికి, పెందుర్తి అసెంబ్లీ సీటుకు బీఎస్పీ అభ్యర్థిగా బంగారు రమణ పెందుర్తి తహసీల్దారు కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి వి. శేషశైలజ వద్ద నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులు అనంతరం ప్రమాణం చేశారు.

బతుకులు కుదేలు

... 5వ పేజీ తరువాయి

నివాసం ఉంటారు. తాము నివాసం ఉండే ప్రాంతాలకు దగ్గరలోని ప్రధాన కూడళ్ల వద్దకు ఉదయాన్నే క్యారేజీలు పట్టుకుని వెళ్లి నిల్చుంటారు. అక్కడకు వర్కర్ మేస్త్రీలు, నిర్మాణ పనులు చేసుకునే కాంట్రాక్టర్లు వచ్చి రోజు కూలీ ప్రాతిపదికన వీరిని తీసుకుని వెళుతుంటారు.

నిలిచిన నిర్మాణాలతో ఇబ్బందులు..

గతంలో నిర్మాణ పనులు చేసే వారికి ఎంత కావాలంటే అంత ఇసుక లభించేది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇసుక విధానంలో మార్పులు చేసింది. దీంతో ఇసుక లభ్యత తగ్గిపోయింది. ఇసుక కొనుగోలు చేయడం నిర్మాణదారులకు కత్తి మీద సాములా మారింది. అదే సమయంలో ఇసుక, ఇటుక ధర కూడా భారీగా పెరిగిపోవడంతో పనులు మందగించాయి. గతంలో ఆటో ఇసుక రూ.500 ఉంటే, ఇప్పుడు రూ.2,000, రూ.3,000 వరకూ వసూలు చేస్తున్నారని, అలాగే ఇటుక గతంలో మూడు రూపాయలు ఉంటే, ప్రస్తుతం అది రూ.10 అయ్యిందని, దీంతో పనులు తగ్గాయని కార్మికులు వాపోతున్నారు. వీటితోపాటు పెరిగిన స్టీల్, సిమెంట్ ధరలు కూడా నిర్మాణ రంగంలోని పనులపై ప్రభావం చూపించాయని, దీంతో తమకు పనులు దొరకకుండా పోయాయని విజయనగరం నుంచి వచ్చి ఆరిలోవలో నివాసం ఉంటున్న రాజారావు అనే తాపీమేస్త్రీ ఆవేదన వ్యక్తం చేశారు.

అప్పులు చేసి జీవనం

గతంలో ఇంటి నుంచి క్యారేజీ పట్టుకుని రోడ్డెక్కితే పని దొరికేదని, ఎప్పుడో నెలలో ఒకటి, రెండుసార్లు పనుల్లేక ఇంటికి వెళ్లేవాళ్లమని, కానీ, గడిచిన కొన్నాళ్ల నుంచి వారంలో ఒకటి, రెండు రోజులు పని దొరకడం కష్టంగా మారుతోందని లక్ష్మణ్ అనే సెంట్రింగ్ వర్కర్ వాపోయాడు. ప్రతిరోజూ క్యారేజీ పట్టుకుని వెళ్లడం, పని దొరక్క ఉసూరుమంటూ రావడం జరుగుతోందన్నాడు. పనులు దొరక్క చాలామంది స్వగ్రామాలకు వెళ్లిపోయారని, ఉన్న వాళ్లలో కూడా ఎంతోమంది ప్రత్యామ్నాయ పనులు చూసుకుంటున్నారని రాజు అనే భవన నిర్మాణ కార్మికుడు వాపోయాడు. గతంలో తనతోపాటు భార్య కూడా పనికి వచ్చేదని, ఇప్పుడు రోజూ ఇసుకతోట జంక్షన్‌కు రావడం, పని లేకుండా వెనక్కి వెళ్లడం జరుగుతోందని, దాంతో రెండు నెలల కిందట ఓ ఇంటిలో పనికి కుదిరిందని వెల్లడించాడు. తనకు పని దొరకకపోయినా ఆమెకు వచ్చే డబ్బుతో ఇంటిని నడుపుతున్నామని, ఇతర ఖర్చులకు అప్పులు చేస్తున్నామని వాపోయాడు.

పెరిగిన ఖర్చులు

నెలంతా పని దొరికితేనే ఇంటిని నడపడం కష్టంగా ఉండేదని, అటువంటిది ఇప్పుడు వారానికి రెండు రోజులు కూడా పని దొరకకపోవడంతో అప్పులు చేస్తున్నామని భవన నిర్మాణ కార్మికులు వాపోతున్నారు. కొందరు కుటుంబ పోషణ కోసం రాత్రివేళల్లో వాచ్‌మెన్లు, సెక్యూరిటీ గార్డులుగా చేరుతున్నారు. పెరిగిన ఇంటి అద్దెలు, కరెంట్ చార్జీలు, నిత్యావసర సరకుల ధరలతో నెలకు కనీసం రూ.15 వేలు అయినా కుటుంబాన్ని పోషించుకునేందుకు కావాల్సి వస్తోందని, పనుల్లేకపోవడంతో కనీసం పది వేలైనా అప్పు చేయాల్సి వస్తోందని రామారావు అనే కూలీ వాపోయాడు. పిల్లలు చదువులకు, ఇతర ఖర్చులకు అప్పులు చేస్తున్నామని, గడిచిన మూడేళ్లలో రూ.2 లక్షలు అప్పు చేశానని వాపోయాడు.

మొగధారమ్మ ఉత్సవాలు ప్రారంభం

సాగర్‌నగర్, ఏప్రిల్ 18 : సాగర్‌నగర్ బీచ్ రోడ్డులో వెలసిన దుర్గాలమ్మ, నూకాలమ్మ సమేత మొగధారమ్మ మహాలక్ష్మీ పద్మాలయం ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ ట్రస్టు ఛైర్మన్ సూరపనేని లక్ష్మీ ప్రసాద్ పర్యవేక్షణలో వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. అనంతరం వాస్తు పూజ, హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గొల్లల ఎండాడ, మునలయ్యపాలెం, సాగర్‌నగర్ ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

భీమునిపట్నం (రూరల్), ఏప్రిల్ 18 : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా వెల్లంకి సీ ఫుడ్ కంపెనీలో చిట్టివలస అగ్నిమాపక కేంద్రం సిబ్బంది ప్రమాదాల నివారణపై గురువారం అవగాహన కల్పించారు. పరిశ్రమల్లో భారీ ప్రమాదాలు జరిగినప్పుడు ఏవిధంగా బయటపడాలో విన్యాసాల ద్వారా తెలియజేశారు. ఇందుకు సంబంధించిన యంత్రాలు, పరికరాలను తీసుకువచ్చి ప్రమాదాల నివారణపై వివరించారు. అగ్నిమాపక కేంద్రం అధికారి జి.శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో సిబ్బంది ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేడు అనిట్స్‌లో అంతర్జాతీయ స్మార్ట్ కంప్యూటరింగ్ సదస్సు

తగరపువలస, ఏప్రిల్ 18 : సంగివలస అనిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ స్మార్ట్ కంప్యూటరింగ్ సదస్సు జరగనున్నట్టు కళాశాల యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సును సీఎస్సీఐటీ, సీఎస్ఎం, సీఎస్‌డీ వంటి కంప్యూటర్ ఆధారిత శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. సదస్సు కోసం దేశ, విదేశాల నుంచి 500కుపైగా పరిశోధనా పత్రాలు రాగా వాటిని పరిశీలించి 90 పరిశోధనా పత్రాలను ప్రచురించనున్నట్టు నిర్వాహకులు చెప్పారు.

580 మందికి వైద్య పరీక్షలు



రోగులకు మందులు అందిస్తున్న వైద్యులు

ఎండాడ, ఏప్రిల్ 18 : జిమ్‌సర్, గీతం దంత వైద్య కళాశాల ఆధ్వర్యంలో గురువారం 30వ వార్డులోని న్యూ సాలిపేట రామాలయం వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో వైద్యులు 580 మంది రోగులకు పలు పరీక్షలు చేసి మందులు అందజేశారు. శిబిరాన్ని జిమ్‌సర్ ప్రో వీసీ డాక్టర్ పి. గీతాంజలి, హెడ్ ఆపరేషన్స్ డాక్టర్ కార్తీక్, మేనేజర్ ఆపరేషన్స్ డాక్టర్ అరుణ్‌నారాయణ్ ప్రారంభించారు. ఈ శిబిరంతో ఇప్పటివరకు వంద ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పద్మనాభం (రూరల్), ఏప్రిల్ 18 : మండలంలోని 33/11 కేవీ రేవిడి ఫీడర్, బోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్ 3 ఈఈ పొలాకి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కోరాడ, గెద్దపేట, లింగన్నపేట, బీఆర్ తాళ్లవలస, రేవిడి, రౌతులపాలెం, వెంకటాపురం, బుడ్డివలస, బర్లపేట, కురపల్లి, శిర్లపాలెం, అనంతవరం, పెంట, కొత్తకొవ్వాడ, పాతకొవ్వాడ, తిమ్మాపురం, గొల్లల తిమ్మాపురం ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని సూచించారు.

ఎంవీపీ కాలనీ : ఆరిలోవ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ పైనాపిల్ కాలనీ ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 వరకూ సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్ త్రీ ఈఈ పొలాకి శ్రీనివాసరావు తెలిపారు. పైనాపిల్ కాలనీ, ముడసర్లోవ, శ్రీకృష్ణాపురం,రామకృష్ణాపురం, ఎస్.ఎస్.ఎన్.నగర్, కామాక్షినగర్, సీబీడీ కార్యాలయం, జె.ఎన్.ఎన్.యు.ఆర్.ఎం. కాలనీ, గోల్ఫ్ క్లబ్, ఇండస్ ఆసుపత్రి ప్రాంతాలకు సరఫరా ఉండదని వినియోగదారులు గమనించాలని కోరారు.

సినిమా గైడ్

- **పారిజాత పర్వం :** సంగం, శ్రీనరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), దుర్గ (మధురవాడ)
- **టెనెంట్ :** శారద, విశేష్ (గోపాలపట్నం), తాతా (తగరపువలస)
- **గీతాంజలి మళ్ళీ వచ్చింది :** మెలోడి, గోకుల్, శ్రీకన్య, రమాదేవి, ఊర్వశి (కంచరపాలెం) మౌర్య (గోపాలపట్నం), హెవెన్-3 (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి),
- **ది ఫ్యామిలీ స్టార్ :** కామేశ్వరి, నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), శ్రీకన్య (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **టిల్లు స్క్వేర్ :** జగదాంబ, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శ్రీవెంకటేశ్వర, కిన్నెర, లక్ష్మీకాంత్ (గాజువాక)
- **మంజుమ్మెల్ బోయ్స్ :** శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **మార్కెట్ మహాలక్ష్మి :** శ్రీలీలామహల్, సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 22, టమాటా 22, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 28, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 40, బీరకాయలు 46, ఆనపకాయలు 18, కాలీఫ్లవర్ 26, క్యాబేజ్ 24, క్యారెట్ 26, దొండకాయలు 26, బంగాళా దుంపలు 25, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 28, అల్లం (పాతది) 150, బరబటి 32, ముల్లంగి 26,నిమ్మకాయలు (కిలో) 90, గోరుచిక్కుడు 32, దోస కాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 110, కొబ్బరికాయ (పెద్దది) 23,బీన్స్ (పెన్సిల్) 46, ఆగాకర 74, పొటల్స్ 68, కీరదోస 24, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 44, చిలగడదుంపలు 30, కంద 60, దేముడు చిక్కుడు 50, కొండఉసిరి 90, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	430
విజయనగరం	434
శ్రీకాకుళం	434

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	110
ఫారం ధర	--	130
విత్ స్కిన్	--	230
స్కిన్‌లెస్	--	240

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..

భీమిలిని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- అవసరమైన ప్రణాళికలు ఉన్నాయి
- టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు



విలేకరులతో మాట్లాడుతున్న గంటా శ్రీనివాసరావు, పక్కన విశాఖ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్, కోరాడ రాజబాబు

భీమునిపట్నం, ఏప్రిల్ 18 : భీమిలి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దడానికి అవసరమైన ప్రణాళికలు తన వద్ద ఉన్నాయని టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఆయన నామినేషన్ దాఖలు చేసిన అనంతరం బీచ్‌రోడ్‌లోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోనే అత్యధికంగా 3 లక్షల 60 వేలు ఓటర్లున్న నియోజకవర్గంగా భీమిలి ప్రత్యేకత పొందిందన్నారు. మూడు గ్రామీణ మండలాలు, పది అర్బన్ వార్డులతో అటు పల్లె వాతావరణం, ఇటు సిటీ వాతావరణం మిళితమైన ప్రదేశం భీమిలి అన్నారు. భవిష్యత్‌లో సిటీపై వత్తిడి తగ్గించడానికి ఎంవీపీ కాలనీ మాదిరిగా ఇక్కడ కూడా శాటిలైట్ టౌన్ షిప్ ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందని చెప్పారు. భోగాపురం ఎయిర్ పోర్టు వినియోగంలోకి వస్తే పట్టణం మరింతగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. రియల్ ఎస్టేట్‌గా, ఐటీ హబ్‌గా, టూరిజం హబ్, ఎడ్యుకేషనల్, వైద్య రంగానికి ఇలా అన్ని రంగాలను ఒక సమగ్ర ప్లాన్‌తో అభివృద్ధి చేయవచ్చునని చెప్పారు. దీనికి స్థానికంగా వున్న మేధావులు, సీనియరు సిటిజన్స్, ఇంటలెక్చువల్స్‌తో సంప్రతించి తగిన సూచనలు, సలహాలు తీసుకుని చక్కటి లోకల్ మేనిఫెస్టో తయారు చేస్తామన్నారు. ఇప్పటివరకూ తాను ఐదు ఎన్నికల్లో పాల్గొన్నానని, ఈ ఆరో ఎన్నికలకు చాలా వైవిధ్యం వుందన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా ఆప్యాయంగా పల కరిస్తున్నారని తెలిపారు. ఐదేళ్ల వైసీపీ విధ్వంస పాలనతో విసిగిన ప్రజలు మళ్లీ మీరే రావాలని ఎదురుచూస్తున్నారని చెప్పారు. కోరాడ రాజబాబు నాలుగేళ్ల పాటు ఎంతో శ్రమించి పార్టీని నిలబెట్టారని కొనియాడారు. జనసేన ఇన్‌ఛార్జి పంచకర్ల సందీప్ గత ఎన్నికల్లో కొత్త వ్యక్తిగా పోటీ చేసి 25 వేలు ఓట్లు తెచ్చుకున్నారని,పొత్తులో భాగంగా ఆయన కూడా తన విజయానికి మద్దతుగా కృషి చేయడం అభినందనీయమన్నారు. ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ సారధ్యంలో నామినేషన్ వేసినట్టు తెలిపారు. ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో తాను ఎంపీగా పోటీ చేసినపుడు కేవలం తొమ్మిది వేల ఓట్లు తేడాతో ఓడిపోయానని, అపుడు జనసేన ఎమ్మెల్యే అభ్యర్థిగా పంచకర్ల సందీప్ పోటీ చేయడంతో ఆయనకు 25 వేలు ఓట్లు వచ్చాయని చెప్పారు.ఇపుడు ఆయన కూడా కూటమితో తన విజయానికి సహకరిస్తున్నారని, దీంతో గతం కంటే తనకు, గంటాకు అత్యధిక మెజారిటీ వస్తుందన్న నమ్మకం ఉందన్నారు. వైసీపీ విధ్వంస పాలనలో భాగంగా గీతం యూనివర్శిటీ ప్రహరీ కూల్చేశారని, భీమిలిలో గంటా భవనం కూడా కూల్చేయడానికి సిద్ధపడ్డారని, కానీ కోర్టు ఉత్తర్వులతో ఆగారన్నారు. రాష్ట్రం బాగుపడాలంటే కూటమిని గెలిపించాలన్న నిర్ణయానికి ప్రజలు వచ్చేసారని స్పష్టంగా తెలుస్తుందన్నారు. తాను 22న నామినేషన్ వేస్తానని, ఇదే ఉత్సాహంతో పోలింగ్‌లో కూడా పాల్గొనాలని కోరారు. సమావేశంలో కోరాడ రాజాబాబు, పంచకర్ల సందీప్, గంటా నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

తొలి రోజు నాలుగు నామినేషన్లు దాఖలు : ఆర్ఓ

భీమునిపట్నం, ఏప్రిల్ 18 : భీమిలి నియోజకవర్గానికి సంబంధించి తొలి రోజు ఇద్దరు అభ్యర్థులు, నాలుగు నామినేషన్లు దాఖలు చేసినట్టు నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి భాస్కర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా గంటా శ్రీనివాసరావు మధ్యాహ్నం 1.09 గంటలకు తన నామినేషన్ పత్రాలు అందజేశారు.గంటా నామినేషన్‌ను రాజులతాళ్లవలసకు చెందిన టీడీపీ భీమిలి మండల అధ్యక్షుడు దంతులూరి అప్పలనరసింహరాజు ప్రతిపాదించారు. అలాగే తెలుగుదేశం అభ్యర్థిగానే గంటా శ్రీనివాసరావు తనయుడు గంటా రవితేజ తన నామినేషన్ పత్రాలను మధ్యాహ్నం 1.22 గంటలకు అందజేశారు. రవితేజ నామినేషన్‌ను 5వ వార్డు టీడీపీ నాయకుడు మొల్లి లక్ష్మణరావు ప్రతిపాదించారు. మొత్తం ఇద్దరూ చెరో రెండు సెట్ల నామినేషన్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు, నియోజకవర్గ జనసేన కన్వీనరు పంచకర్ల సందీప్, 2వ వార్డు కార్పొరేటర్ గాడు చిన్నికుమారిలక్ష్మి, డాక్టర్ సోమనాథ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు వెలగపూడి నామినేషన్

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 18 : తూర్పు నియోజకవర్గం టీడీపీ వెలగపూడి రామకృష్ణబాబు శుక్రవారం నామినేషన్ వేయనున్నారు. ఎంవీపీ కాలనీలోని తన క్యాంపు కార్యాలయం నుంచి బీచ్ రోడ్డు మీదుగా కలెక్టరేట్ వరకూ ర్యాలీగా వెళ్లడానికి భారీ సన్నాహాలు చేస్తున్నారు. ప్రతి వార్డు నుంచి వెయ్యి మంది వరకూ కార్యకర్తలు పాల్గొంటారని భావిస్తున్నారు. పది వేల నుంచి పది హేను వేల మంది ర్యాలీలో ఆటోలు, బైక్‌లు, కార్లతో పాల్గొనడానికి ఆయా వార్డుల నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

రథోత్సవానికి బారికేడ్లు ఏర్పాటుపై విమర్శలు



మాడవీధిలో ఏర్పాటు చేసిన బారికేడ్లు

సింహాచలం,ఏప్రిల్ 18 : అప్పన్న స్వామి వార్షిక తిరు కల్యాణోత్సవం వేళ జిల్లా అధికారుల కొత్త ఆలోచనలు సత్ఫలితాలిస్తాయా లేదా మరిన్ని సమస్యలకు దారి తీస్తాయా అన్నది తెలియాల్సి ఉంది. ఏటా ఉత్సవానికి ముందు సింహగిరి ప్రధాన మాడవీధుల్లో స్వామివారి రథోత్సవం జాలరి కులపెద్ద కదిరి లక్ష్మణరావు సారధ్యంలో భక్తుల సహకారంతో నిర్వహించడం ఆనవాయితీ. కానీ ఈసారి ప్రధాన మాడవీధుల్లో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు బారికేడ్లు ఏర్పాటు చేశారు. దీంతో రథోత్సవ మార్గం కొంతమేరకు వెడల్పు తగ్గింది. రథంపై స్వామివారిని అధిష్ఠింపజేసిన తరువాత మత్స్యకారులతో పాటు వందలాది మంది భక్తులు కూడా రథం తాడు లాగి తమ భక్తిని చాటుకుంటారు. అయితే బారికేడ్లు ఏర్పాటు వల్ల స్థలా భావం ఏర్పడి భక్తులకు ఇబ్బంది కలిగే అవకాశం ఉంది. దీంతో రథం లాగడం కొద్దిపాటి సంఖ్యలోని భక్తులకు ఎక్కువ శ్రమ కావొచ్చు. గతంలో ఎన్నడూ లేని విధంగా జిల్లా అధికారులు ఈఏడాది ఈ నిర్ణయం తీసుకోవడం విమర్శలు వ్యక్తమవుతున్నాయి.బారికేడ్లు అవసరం లేదని దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులు చెప్పినా వినకుండా కొందరు పోలీసు అధికారులు ఈఓపై వత్తిడి చేసి ఏర్పాటు చేసినట్టు పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

బీసీ బాలుర వసతి గృహంలో తాగునీటి కష్టాలు



ఎగువపేటలోని బోరు నుంచి బకెట్‌తో నీరు తీసుకువస్తున్న విద్యార్థులు

భీమునిపట్నం, ఏప్రిల్ 18 : పట్టణంలోని శ్రీలక్ష్మీ నృసింహస్వామి కొండ రోడ్డులో ఉన్న వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహం విద్యార్థులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒకవైపు మండిపోతున్న ఎండలకు తోడు ఒంటి మీద కనీసం దుస్తులు కూడా లేకుండా అష్ట కష్టాలు పడుతూ సుదూర ప్రాంతాల నుంచి నీరు తెచ్చుకుంటున్నారు. చిన్నారుల కష్టాన్ని చూసిన పలువురు ఆవేదన చెందుతున్నారు. చదువుకోవడానికి సుదూర ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చిన విద్యార్థులు మండిపోతున్న ఎండల్లో మంచినీరు మోసుకు వెళ్లడం, దుస్తులు ఉతుక్కోవడం పట్ల పలువురు విచారం వ్యక్తం చేస్తున్నారు. వసతి గృహంలో మంచినీటి మోటారులో భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో ఈ సమస్య ఉత్పన్నమైంది. దీంతో చిన్నారులు రెండు వందల మీటర్ల దూరంలో వున్న ఎగువపేట వద్ద వున్న బోరు వద్దకు వెళ్లి బకెట్లతో నీరు మోసుకువస్తున్నారు. ఇక్కడ సుమారు 140 మంది విద్యార్థులు ఉంటున్నారు. కాగా ఈవిషయమై వసతి గృహ సంక్షేమాధికారి సన్యాసినాయుడు వద్ద 'ఆంధ్ర జ్యోతి' ప్రస్తావించగా గత ఏడాది డైట్ ఆవరణలో మోటారు తవ్విన దగ్గర నుంచి ఈ సమస్య తలెత్తిందని, వేసవి కావడంతో నీటి నిల్వలు అడుగంటిపోవడంతో మోటారు వేసిన అరగంట ఆగిన తర్వాత మళ్లీ వేస్తే నీళ్లు వస్తున్నాయన్నారు. జీవీఎంసీ అధికారులను ట్యాంకర్‌తో మంచినీటిని సరఫరా చేయాలని కోరామని, పంపుతామన్నారని తెలిపారు. అధికారులు తక్షణమే స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవా లని పలువురు కోరుతున్నారు.

జగన్ పేదల పక్షపాతి : ఎంవీవీ



హెచ్‌బీ కాలనీలో జరిగిన సిద్ధం సభలో మాట్లాడుతున్న ఎంవీవీ

వెంకోజీపాలెం, ఏప్రిల్ 18 : ముఖ్యమంత్రి జగన్ పేదల పక్షపాతి అని తూర్పు వైసీపీ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. గురువారం సాయంత్రం ఆయన 16వ వార్డు హెచ్‌బీ కాలనీలో నిర్వహించిన సిద్ధం సభలో మాట్లాడారు. ప్రజలంతా పెత్తందార్లతో యుద్ధానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రతిపక్ష పార్టీలు అధికారంలోకి రావడానికి కుట్రలు, కుతంత్రాలు పన్నుతున్నాయని, జగన్ అమలు చేసిన పథకాలే తమకు శ్రీరామ రక్ష అని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసీపీ తూర్పు ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు, 16వ వార్డు అధ్యక్షుడు చొల్లంగి నాగేశ్వరరావు, పల్లా శ్రీను పాల్గొన్నారు. అంతకముందు ఎంవీవీ 23వ వార్డులోని పలు ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖను పరిపాలన రాజధానిగా చేయడానికి సీఎం జగన్ కట్టుబడి ఉన్నారన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ గెలిచిన తరువాత విశాఖలోనే సీఎం ప్రమాణ స్వీకారం ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గుడ్ల విజయసాయి, గుడ్ల సత్యారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.కాగా 19వ వార్డు పెదజాలారిపేటలోనూ సిద్ధం సభ జరిగింది. రామచంద్రరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకటనారాయణ, వార్డు ఇన్‌ఛార్జి సూరాడ వెంకట లక్ష్మీ దాస్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటు వేయండి

- భీమిలి వైసీపీ అభ్యర్థి ముత్తంశెట్టి



ఏడో వార్డులో ఓట్లు అభ్యర్థిస్తున్న ముత్తంశెట్టి

మధురవాడ/కొమ్మాది, ఏప్రిల్ 18 : భీమిలి నియోజకవర్గంలో ఐదేళ్లలో తాను చేసిన అభివృద్ధిని చూసి ఓటేసి గెలిపించాలని వైసీపీ అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు కోరారు. గురువారం ఆయన 7వ వార్డులోని పీఎం పాలెం, ఆర్టీసీ కాలనీ, దివ్యాంగుల కాలనీ, పాత మధురవాడ ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముత్తంశెట్టి మాట్లాడుతూ ఐదేళ్లలో మధురవాడ పరిసరాల్లో వందల కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి పనులు చేశామన్నారు. ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించారని, ప్రతి ఇంట్లో ప్రభుత్వం అందించిన పథకాల లబ్ధిదారులు ఉన్నారని చెప్పారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలే తమకు శ్రీరామ రక్ష అన్నారు. సచివాలయం, వలంటీర్ల వ్యవస్థలు దేశంలోని పలు రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. జగన్ సభలకు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలకు చెందిన వారు రాళ్లు రువ్వే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. వైసీపీ మళ్లీ అధికారంలోకి వస్తే విశాఖను రాజధానిచేస్తామని, విశాఖ రాజధాని అయితే ఉత్తరాంధ్ర అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. రాజకీయం అంటే వ్యాపారంగా భావించే టీడీపీ అభ్యర్థికి ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. ఉత్తర ఎమ్మెల్యేగా పని చేసిన ఆయన ఐదేళ్లలో ఒక్కసారి కూడా ప్రజలకు ముఖం చూపించలేదని విమర్శించారు. వచ్చేనెల 13న జరిగే పోలింగ్‌లో ఎమ్మెల్యేగా తనకు, ఎంపీగా బొత్స ఝాన్సీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.అలాగే కొమ్మాది దరి సాయిరాంకాలనీలోనూ ముత్తంశెట్టి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రత్యర్థి పార్టీలు చెప్పే మాయ మాటలు, ప్రలోభాలకు లొంగిపోవద్దని ప్రజలను కోరారు. ఎమ్మెల్యేగా ప్రతి ఇంటికి తిరిగానని, నిత్యం ప్రజలతోనే ఉన్నానని చెప్పారు. ఐదేళ్లలో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపానని, మరోసారి తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైసీపీ వార్డు అధ్యక్షుడు పోతిన హనుమంతురావు, పోతిన సురేష్, జేఎస్. రెడ్డి, వైఎస్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.



కొమ్మాదిలోని సాయిరాం కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

చంద్రబాబు పాలనతోనే రాష్ట్రాభివృద్ధి

- తూర్పు టీడీపీ అభ్యర్థి వెలగపూడి



పెదజాలారిపేటలో ప్రచారం చేస్తున్న వెలగపూడి

పెదవాల్తేరు, ఏప్రిల్ 18 : చంద్రబాబు పాలనతోనే రాష్ట్రానికి మంచి భవిష్యత్తు అని టీడీపీ తూర్పు నియోజకవర్గం అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. గురువారం ఆయన 19వ వార్డు పెదజాలారిపేటలో రామాలయం వీధి, గాంధీ బొమ్మ సెంటర్, చేపల మార్కెట్ ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి కేరాఫ్ తెలుగుదేశం పార్టీ అన్నారు. ఎన్టీఆర్ హయాంలో రెండు రూపాయలకు కిలో బియ్యం, పేదలకు పక్కా ఇళ్లు, మహిళలకు ఆస్తి హక్కు, స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లు తదితర పథకాలను ప్రజల ఇప్పటికీ మర్చిపోలేదన్నారు. అనంతరం ఆయన ఇంటింటికి వెళ్లి చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఎన్నికల్లో తనను మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కాగా ఎన్నికల ప్రచారంలో భాగంగా వెలగపూడి సతీమణి సుజన 21వ వార్డు అంబేడ్కర్ కాలనీ, లాసన్స్ బే కాలనీలో ప్రచారం నిర్వహించారు. బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలు పంచుతూ ప్రజలకు వాటి గురించి వివరించారు. వెలగపూడిని ఎమ్మెల్యేగా, శ్రీభరత్‌ను ఎంపీగా గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, వార్డు అధ్యక్షులు, కార్యదర్శులు, మహిళా నాయకులు పద్మజ, సీత మాధురి, శ్రీలక్ష్మి, సబిత, సరోజచ రాధిక, సుమ, పీతల అఖిల్, పాల్గొన్నారు.



19వ వార్డులో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పాదయాత్ర చేస్తున్న రామకృష్ణబాబు

స్వర్ణ నారసింహునిగా అప్పన్న దర్శనం



సింహాచలం, ఏప్రిల్ 18 : వరాహలక్ష్మీనృసింహ స్వామి భక్తులకు గురువారం స్వర్ణ నారసింహ కవచంతో దర్శనమిచ్చారు. స్వామివారి వార్షిక తిరు కల్యాణోత్సవాల ప్రారంభాన్ని పురస్కరించుకుని స్వామివారిని పలు రకాల స్వర్ణాభరణాలు, వివిధ రకాల పరిమళభరిత పుష్పమాలికలతో స్వర్ణ నారసింహ కవచంతో అలంకరించిన తీరు భక్తులను ఆకట్టుకుంది.

డేటా లింక్ బ్రిడ్జి టెక్నాలజీకి పేటెంట్

వెంకోజీపాలెం, ఏప్రిల్ 19 : ఏయూ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగాచార్యులు డి.లలిత భాస్కరి, పరిశోధకుడు డాక్టర్ మనోజ్‌కు ఇండియన్ పేటెంట్ ఆఫీస్ పేటెంట్ మంజూరు చేసింది. డేటా లింక్ బ్రిడ్జి టెక్నాలజీపై వారు చేసిన అధ్యయనానికి గాను ఈ పేటెంట్ లభించింది. ఈ సందర్భంగా ఏయూ వీసీ ప్రసాదరెడ్డి గురువారం తన కార్యాలయంలో లలిత భాస్కరిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య జేమ్స్ స్టీఫెన్, డీపీఐఐటీ - ఐపీఆర్‌చైర్ ప్రొఫెసర్ పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకులు పంపిణీ

రామ్‌నగర్, ఏప్రిల్ 18 : సమాజ సేవలోనే సంతృప్తి ఉంటుందని ఉపకార ఛారిటబుల్ ట్రస్టు అధినేత కంచర్ల అచ్యుతరావు అన్నారు. గురువారం ఆయన తూర్పు నియోజకవర్గంలో రామ్‌నగర్, వాల్తేర్, ఆరిలోవ ప్రాంతాల్లో పేదలకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ ట్రస్టు ద్వారా 21 ఏళ్లుగా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. సామాజిక సేవలో ఆత్మ సంతృప్తి ఉంటుందని, యువత సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు ఉపేంద్ర, పార్దు, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం

సింహాచలం, ఏప్రిల్ 18 : వరాహలక్ష్మీనృసింహస్వామి నిత్యాన్న ప్రసాద పథకానికి శ్రీకాకుళం జిల్లా మందస ప్రాంతానికి చెందిన రోజాపంతుల తిరుపతిరావు రూ. లక్ష విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తం రూ.1,00,116లను నగదు రూపంలో అన్నప్రసాద విభాగం ఇన్‌ఛార్జి ఏఈఓ పాలూరి నరసింగరావుకు గురువారం అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాత కుటుంబ సభ్యులకు అధికారులు అంతరాలయ దర్శనం కల్పించి స్వామివారి వేదాశీర్వచనాలు, శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశారు.

రహదారులపై మురుగునీరు

భీమునిపట్నం, ఏప్రిల్ 18 : జీవీఎంసీ 3వ వార్డులోని పలు కాలువల్లో పూడికలు నిండిపోయి దుర్వాసన వస్తోంది. కొన్నిచోట్ల మురుగు నీరు రోడ్లపైకి వస్తుండడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గొల్లవీధి జంక్షన్, శ్రీలక్ష్మీనృసింహస్వామి రోడ్డులోని సాంఘిక సంక్షేమ కళాశాల విద్యార్థుల వసతిగృహం వద్ద ఈ పరిస్థితి మరింత దారుణంగా ఉంది. దీంతో ప్రజలు దుర్వాసన భరించలేకపోతున్నారు.అధికారులు తక్షణమే స్పందించి కాలువల్లో పూడిక తీయించాలని పలువురు కోరుతున్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

సాగర్‌నగర్, ఏప్రిల్ 18 : బీచ్ రోడ్డులోని జూపార్కు సమీపంలో గురువారం ఉదయం విజయనగరం నుంచి బీచ్ రోడ్డు మీదుగా వస్తున్న ఎలక్ట్రిక్ కారు టైర్ పంక్చర్ కావడంతో అదుపు తప్పి డివైడర్ మధ్య ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ప్రమాద సమయంలో కారు నడిపే వ్యక్తితో పాటు మరో ఇద్దరు ఉన్నారు. టైర్ పంక్చర్ అయిన వెంటనే కారు అదుపు తప్పి డివైడర్ మధ్య ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో స్తంభం ముక్కలై నేలకొరిగింది. కారులో డ్రైవర్‌తో పాటు కేజీహెచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీదేవి, మరో మహిళ ఉన్నారు. ఆరిలోవ ట్రాఫిక్ ఎస్ఐ శ్రీకాంత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాద సమయంలో రోడ్డులో జన సంచారం లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.